aruhi
aruhi group
BBTV
BBTV TELUGU
BBTVNETWORK

తెలుగు దినపత్రిక

నమస్తే

# మహాప్రభ

ప్రజల కోసం.., ప్రజలతో...మహాప్రభ


శనివారం
21-02-2026 సంపుటి : 01 సంచిక : 22 పేజీలు : 08 వెల : ₹ 5/- RNI NO : TGTEL/26/A0738

Published From HYDERABAD,VIJAYAWADA తెలంగాణ , ఆంధ్రప్రదేశ్. www.mahaaprabha.com MAHAAPRABHA.DAILY

BESQATI
besqati.com
Contact : info@besqati.com

## బంగ్లాదేశ్ ప్రభుత్వం కీలక నిర్ణయం


- భారత పౌరులకు వీసా సర్వీసుల పునరుద్ధరణ
- రెండు నెలులుగా నిలిచిపోయిన వీసా సర్వీసులు తిరిగి ప్రారంభం
- తారిఖ్ రెహ్మాన్ బంగ్లాదేశ్ ప్రధానిగా పదవీ బాధ్యతలు చేపట్టిన మూడు రోజుల తర్వాత ఈ కీలక పరిణామం



న్యూఢిల్లీ - ఫిబ్రవరి 20 (మహాప్రభ )
ఇండియాతో సంబంధాల పునరుద్ధరణ దిశగా తారిఖ్ రెహ్మాన్ సారథ్యంలోని బంగ్లాదేశ్ ప్రభుత్వం తొలి అడుగు వేసింది. భారతీయ పౌరులకు వీసా సర్వీసులను ఢిల్లీలోని బంగ్లాదేశ్ హై కమిషన్ శుక్రవారంనాడు పునరుద్ధరించింది. దీంతో రెండు నెలులుగా నిలిచిపోయిన వీసా సర్వీసులు తిరిగి ప్రారంభమయ్యాయి. బీఎన్పీ నేత తారిఖ్ రెహ్మాన్ బంగ్లాదేశ్ ప్రధానిగా పదవీ బాధ్యతలు చేపట్టిన మూడు రోజుల తర్వాత ఈ కీలక పరిణామం చోటుచేసుకుంది. బంగ్లాదేశ్‌లోని అన్ని వీసా సర్వీసులను త్వరలోనే -మిగతా 3 లో

## 15 రోజుల్లో తేల్చాలి..

- అణు ఒప్పందంపై ఇరాన్‌కు ట్రంప్ వార్నింగ్
- ఈలోగా ఒక ఒప్పందానికి రాకపోతే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరిక
- మరోవైపు రష్యాతో కలిసి ఇరాన్ నావికా విన్యాసాలు
- ఒకవైపు ఒప్పందంపై చర్చలు అంటూనే.. రెండు దేశాలూ యుద్ధ సన్నాహాలు



న్యూఢిల్లీ - ఫిబ్రవరి 20 (మహాప్రభ )
అమెరికా- ఇరాన్ మధ్య ఉన్న వివాదం ఎటూ తేలడం లేదు. తమతో అణు ఒప్పందం చేసుకుని తీరాల్సిందే అని ఇరాన్‌పై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఒత్తిడి తెస్తున్నాడు. అయితే, ఈ అంశంపై ఇరాన్ కొన్ని షరతులు విధించింది. ఒకవైపు ఒప్పందంపై చర్చలు అంటూనే.. రెండు దేశాలూ యుద్ధ సన్నాహాలు కూడా చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఇరాన్‌కు ట్రంప్ వార్నింగ్ ఇచ్చాడు. 10-15 రోజుల్లో ఇరాన్ తమతో అణు ఒప్పందం చేసుకుని తీరాలని అల్టిమేటమ్ ఇచ్చాడు. -మిగతా 3 లో




## గురుకులాలపై సర్కారు నజర్

- జిల్లాకు ఒక నోడల్ అధికారి నియామకం..
- విద్యార్థుల భద్రత, సంక్షేమమే లక్ష్యం

హైదరాబాద్ - ఫిబ్రవరి 20 (మహాప్రభ )
రాష్ట్రంలో గురుకులాల రూపురేఖలు మార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. కేవలం విద్య మాత్రమే కాకుండా విద్యార్థుల జీవన ప్రమాణాలు, వసతులు, మానసిక, శారీరక ఆరోగ్యంపై క్షేత్రస్థాయి పర్యవేక్షణను పటిష్టం చేయాలని అధికారులకు ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలను జారీ చేసింది. అందులో భాగంగా ప్రతి జిల్లాలో నోడల్ అధికారుల నియామకం తప్పనిసరి చేస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. అధికారులు కేవలం కార్యాలయాలకే పరిమితం కాకుండా, ఎటువంటి ముందస్తు సమాచారం లేకుండా 'ఆకస్మిక తనిఖీలు' నిర్వహించి గురుకులాల పనితీరును అంచనా వేయాల్సి ఉంటుంది. దీనివల్ల సిబ్బంది జవాబుదారీతనం పెరుగుతుందని సర్కారు భావిస్తోంది. ప్రతినెలా 5వ తేదిలోపు పురోగతి నివేదికలను ప్రభుత్వానికి అందజేయాలని తెలిపింది.

## మార్చి 31 నుంచి ఏప్రిల్ 2 వరకు ట్రంప్ చైనా పర్యటన

2 లో

## తెలంగాణలో ఏఐ స్టార్టప్ విలేజ్

### హైదరాబాద్‌లో ఏఐ వార్ రూమ్ ఏర్పాటు చేసేందుకు సిద్ధం

- భారత్.. ఏఐ పవర్ మారాలి
- కేంద్రంలో ఏఐకి మంత్రిత్వ శాఖ ఉండాలి
- మానవ పరిణామ క్రమంలో ఏఐ.. శక్తిమంతమైన మలుపు: సీఎం రేవంత్
- ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్‌లో రేవంత్ ప్రసంగం
- డిజిటల్ గవర్నెన్స్‌లో తెలంగాణ రోల్ మోడల్: మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

న్యూఢిల్లీ,- ఫిబ్రవరి 20 (మహాప్రభ )
తెలంగాణలో ఏఐ స్టార్టప్ విలేజ్, హైదరాబాద్‌లో ఏఐ వార్‌రూమ్ ఏర్పాటు చేయడానికి తమ ప్రభుత్వం సిద్ధంగా ఉందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. కృత్రిమ మేధ (ఏఐ) రంగంలో భారత్ పవర్ హౌస్‌గా మారాలని ఆకాంక్షించారు. కేంద్రంలో ఏఐ కోసం ప్రత్యేకంగా మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని సూచించారు. ఏఐ వినియోగం, నియంత్రణ, చట్టపరమైన మార్గదర్శకాలు, -మిగతా 3 లో






## ఏలియన్స్ గుట్టు బయటపెడతాం

- వాటికి సంబంధించిన ఫైళ్లను వెల్లడిస్తాం
- అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వెల్లడి




## పాక్ సైనికుల్ని నిర్బంధించిన బీఎల్‌ఏ ఆర్మీ ..

- తమ వాళ్లే కాదంటున్న పాక్..
- ఐడీలు చూపిన పాక్ సైనికులు బంధీలు
- తాము దేశం కోసం ప్రాణాలిచ్చేందుకు సిద్ధమైతే..
- తమ దేశం కనీసం తమను పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం

## భవిష్యత్‌లో అమరావతి క్వాంటమ్‌పై చర్చిస్తారు

- కంప్యూటింగ్ పరకరాలకు క్వాంటం ఎకోసిస్టమ్‌కు రూపకల్పన
- డీప్ టెక్నాలజీ రంగంలో మరింత ముందుకెళ్లేలా దృష్టి
- స్పేస్, డ్రోన్, ఎలక్ట్రానిక్స్, మెడ్‌టెక్ పార్క్ లాంటి పారిశ్రామిక క్లస్టర్లు
- ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్-2026లో ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు
- పలు సంస్థలతో ఎంఓయూలు కుదుర్చుకున్న ఏపి ప్రభుత్వం




న్యూఢిల్లీ,- ఫిబ్రవరి 20 (మహాప్రభ )
అమరావతి క్వాంటం వ్యాలీ గురించి ప్రపంచమంతా మాట్లాడే రోజు సమీప భవిష్యత్‌లో వస్తుందని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ప్రపంచానికి క్వాంటం కంప్యూటింగ్‌కు సంబంధించిన పరికరాలను కూడా తయారు చేసేలా క్వాంటం ఎకోసిస్టమ్‌కు రూపకల్పన చేసినట్లు తెలిపారు. ఏపీలో స్పేస్, డ్రోన్, ఎలక్ట్రానిక్స్, మెడిటెక్ పార్క్‌లాంటి ప్రత్యేక పారిశ్రామిక క్లస్టర్లు ఉన్నాయని వివరించారు. -మిగతా 3 లో

## ఎప్రిల్‌లో తెలంగాణలో సర్ ప్రక్రియ

- జిల్లాల అధికారులకు ఎన్నికల అధికారి సూచనలు





హైదరాబాద్, - ఫిబ్రవరి 20 (మహాప్రభ )
ఏప్రిల్‌లో ప్రారంభం కానున్న ప్రత్యేక ఓటర్ల సమగ్ర సవరణ ఎస్ఐఆకు సంబంధించి సన్నాహకాలను వేగవంతం చేయాలని కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల నేపథ్యంలో తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి శిక్షణ కార్యక్రమాలను ముమ్మరం చేశారు. ఈ నేపథ్యంలో హైదరాబాద్‌లోని సీఈవో కార్యాలయం నుంచి మెదక్, మల్కాజిగిరి, సంగారెడ్డి, రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల సహాయ ఎన్నికల నమోదు అధికారులకు ఆన్‌లైన్ శిక్షణ నిర్వహించారు.మొత్తం 195 మంది ఏఈఆర్‌ఓలు ఈ శిక్షణలో పాల్గొన్నారు. ఓటరు జాబితాల తయారీ, నవీకరణ, నిర్వహణ అంశాలపై విపులంగా అవగాహన కల్పించారు. అర్హులైన ప్రతి ఒక్కరిని ఓటరు జాబితాల్లో చేర్చడం, అనర్హుల పేర్లను తొలగించడం, వివరాల సవరణ వంటి అంశాలపై స్పష్టమైన మార్గదర్శకాలు అందించారు. -మిగతా 3 లో

## మున్సిపాలిటీలను అభివృద్ధి చేస్తాం

### మంత్రి పొన్నం ప్రభాకర్

- నిజామాబాద్ మేయర్‌గా ఉమారాణి బాధ్యతలు
- మోడల్ కార్పొరేషన్లుగా తీర్చిదిద్దుతాం
- టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్ గౌడ్

కంఠేశ్వర్ - ఫిబ్రవరి 20 (మహాప్రభ )
ఇటీవల జరిగిన ఉప ఎన్నికలతో పాటు పంచాయతీ, మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలు కాంగ్రెస్ పార్టీని ఆశీర్వదించారని, ప్రతి మున్సిపాలిటీని అభివృద్ధి పథంలోకి తీసుకువెళ్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. శుక్రవారం నిజామాబాద్ మున్సిపల్ కార్యాలయంలో మేయర్‌గా కూరగాయల ఉమారాణి బాధ్యతల స్వీకరించారు. ఈ కార్యక్రమానికి పీసీసీ చీఫ్ బొమ్మ మహేశ్ కుమార్‌గౌడ్, ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్‌అలీ, -మిగతా 3 లో



## హిందూ మహా సముద్ర రక్షణే లక్ష్యం

- అంతర్జాతీయ ఫోరం అధ్యక్ష బాధ్యతలు స్వీకరించిన భారతనౌకాదళం
- సభ్య దేశాల మధ్య సమన్వయం పెంచుతాం : దినేష్ కె త్రిపాఠి

న్యూఢిల్లీ,- ఫిబ్రవరి 20 (మహాప్రభ )
విశాఖ కేంద్రంగా ఈనెల 15 నుంచి జరుగుతోన్న ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూ (ఐఎఫ్ఆర్) మిలాన్-2026లో భాగంగా శుక్రవారం తూర్పునౌకాదళంలో 9వ ఇంటర్నేషనల్ ఓషన్ నేవల్ సింపోజియం (ఐఒఎన్ఎస్ -ఐయాన్స్) కాన్‌క్లేవ్ జరిగింది. 'హిందూ మహా సముద్ర ప్రాంతంలో సముద్ర భద్రతను పటిష్టం చేసే దిశగా భారత్ మరో కీలక అడుగు వేసింది. భారత నౌకాదళం దీని అధ్యక్ష్య బాధ్యతలను స్వీకరించింది. రాయల్ థారులాండ్ నేవీ నుంచి నేవల్ చీఫ్ (అడ్మిరల్) దినేష్ కె త్రిపాఠి ఈ బాధ్యతలను తీసుకున్నారు. 2008లో ఐఒఎన్ఎస్ వ్యవస్థాపక అధ్యక్షత దేశంగా భారత్ ఉండేది. రెండేళ్ల పాటు అధ్యక్షత దేశంగా కొనసాగింది. మళ్లీ 16 ఏళ్ల తర్వాత ఈ గౌరవాన్ని ఇండియన్ నేవీ దక్కించుకుంది. 33 దేశాలకు చెందిన -మిగతా 3 లో



# ఈశాన్య రాష్ట్రాల్లో సంచలనం

**ఒకే ఛాసిస్ నెంబర్, ఒకే ఇంజిన్ నెంబర్‌తో 16,000 వాహనాలు..**



**న్యూఢిల్లీ - ఫిబ్రవరి 20 (మహాప్రభ )**
ఈశాన్య రాష్ట్రాల్లో ఒకే ఛాసిస్ నెంబర్, ఒకే ఇంజిన్ నెంబర్‌తో 16,000 వరకు వాహనాలు రిజిష్టర్ అయినట్లు తాజాగా వెల్లడైంది. కంట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) నిర్వహించిన తనిఖీల్లో ఈ సంచలనం బయటపడింది. దీనికి సంబంధించిన నివేదికను తాజాగా అసోం అసెంబ్లీలో ప్రవేశపెట్టారు. అసోంతోపాటు, మిగతా ఏడు ఈశాన్య రాష్ట్రాల్లో వాహనాలకు సంబంధించి వాహన్ డాటాబేస్‌ను తనిఖీ చేయడం ద్వారా ఈ భారీ తప్పిదాన్ని గుర్తించారు.మొత్తం 15,849 వాహనాలు దాదాపు ఒకే ఛాసిస్ నెంబర్, ఒకే ఇంజిన్ నెంబర్‌తో ఉన్నట్లు గుర్తించారు. ఇవి ఒకే రాష్ట్రంలో కాకుండా, రెండు, మూడు రాష్ట్రాల్లో రిజిష్టర్ అయి ఉన్నాయి. వీటిలో దాదాపు 76 శాతం.. అంటే 12,112 వాహనాలు ఒక్క అసోం రాష్ట్రంలోనే రిజిష్టర్ అయ్యాయి. ఎలాంటి నో ఆబ్జెక్షన్ సర్టిఫికెట్ (ఎన్‌ఓసీ) లేకుండానే వీటి రిజిస్ట్రేషన్ జరిగింది. రూల్స్ ప్రకారం ప్రతి వాహనానికి ఒక ప్రత్యేక నెంబర్ ఉంటుంది. అది ఛాసిస్ నెంబర్ అయినా, ఇంజిన్ నెంబర్ అయినా ఒకదానితో ఒకటి మ్యాచ్ అవ్వదు. వీటి ఆధారంగానే రిజిస్ట్రేషన్ జరుగుతుంది. ఒకవేళ ఒకరి నుంచి మరొకరికి, ఒక రాష్ట్రం నుంచి మరో రాష్ట్రానికి మారినప్పుడు రిజిస్ట్రేషన్ చేయాలంటే మొదటిది క్యాన్సిల్ చేయాలి. కానీ, ఇవేవీ జరగకుండానే వాహనాల్ని ఇష్టమొచ్చినట్లు రిజిస్ట్రేషన్ చేసిన విషయం బయటపడింది.ప్రధానంగా ఎనిమిది జిల్లా రవాణా కేంద్రాలలో ఈ వ్యత్యాసాల్ని గుర్తించారు. 2019-2024 మధ్య కాలంలో 1,19,369 రిజిష్టర్డ్ వాహనాలకు సంబంధించి 26,105 పర్మిట్లు మాత్రమే ఉన్నాయి. స్కూల్ బస్సులకు అనుమతుల మంజూరులో కూడా అవకతవకలు జరిగాయి. సరైన ఫిట్‌నెస్ టెస్టులు లేకుండానే స్కూల్, కాలేజీలు వంటి ఎడ్యుకేషనల్ బస్సులకు అనుమతులిచ్చినట్లు తేలింది. ఈశాన్య రాష్ట్రాల్లో 1.29 లక్షల వాహనాల్లో 29,560 వాహనాలు పన్నులే చెల్లించడం లేదు. దాదాపు రూ.61.28 కోట్ల పన్నుల్ని ఇలా ఎగ్గొట్టారు. అలాగే 24.53 కోట్ల జరిమానాలు కూడా ఎగవేశారు. వాహనాల కాలుష్య నియంత్రణకు సంబంధించి కూడా లోపాలు బయటపడ్డాయి. అయితే, అసోం వంటి రాష్ట్రంలో సరైన రవాణా శాఖ ఉద్యోగులు లేకపోవడం కూడా ఇలాంటి పొరపాట్లకు కారణాలుగా కనిపిస్తున్నట్లు కాగ్ వెల్లడించింది.

# ఇండోపాక్ ఫైట్‌లో 11 యుద్ధ విమానాలు కూలాయి



**వాషింగ్టన్ న్యూఢిల్లీ - ఫిబ్రవరి 20 (మహాప్రభ )**
భారత్, పాకిస్థాన్ మధ్య గత ఏడాది యుద్ధ వాతావరణం నెలకొన్నదని, ఆ సంక్షోభాన్ని తానే పరిష్కరించినట్లు అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్(ణశీఱఝశ్రీ౧ ౯తీబవఎజా) తెలిపారు. ఒకవేళ యుద్ధాన్ని ఆపకపోతే, 200 శాతం వాణిజ్య పన్ను విధించనున్నట్లు ఆ రెండు దేశాలను బెదిరించినట్లు ఆయన పేర్కొన్నారు. బోర్డ్ ఆఫ్ పీస్ ఈవెంట్‌లో భాగంగా జరిగిన కార్యక్రమంలో ట్రంప్ మాట్లాడారు. ఇండియా, పాకిస్థాన్ సమరం వేళ సుమారు 11 యుద్ధ విమానాలు కూలినట్లు ఆయన వెల్లడించారు. అయితే ఆపరేషన్ సింధూర్ తర్వాత ట్రంప్ చేస్తున్న వ్యాఖ్యలను ఇండియా వరుసగా ఖండిస్తూనే ఉన్నది. పాక్‌తో జరిగిన సంధి వేళ.. మూడవ దేశ జోక్యం లేదని భారత్ పేర్కొన్నది. ఆ సంక్షోభ సమయంలో యుద్ధ విమానాలు కూలలేదని కూడా భారత్ వెల్లడించింది.బోర్డ్ ఆఫ్ పీస్ మీటింగ్‌లో మాట్లాడిన ట్రంప్.. తన ప్రసంగంలో వేళ పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్‌ను కొంత సేపు నిలబడాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఇతర దేశాల నేతలు కూడా పాల్గొన్నారు. మధ్యవర్తిత్వం చర్చల గురించి వివరిస్తూ ట్రంప్ మరోసారి ఇండోపాక్ సంక్షోభాన్ని లేవనెత్తారు. ఇండియా, పాక్ మధ్య భీకర వార్ జరిగిందని, కానీ ఆ యుద్ధాన్ని తన టారిఫ్ బెదిరింపుల ద్వారా ఆపేసినట్లు చెప్పారు. మధ్యవర్తిత్వం ద్వారా మూడు కోట్ల మంది ప్రాణాలు కాపాడినట్లు పాక్ ప్రధాని తనను ప్రశంసించినట్లు ట్రంప్ వెల్లడించారు. ప్రధాని మోదీ కూడా తనకు మంచి మిత్రుడుని, కానీ భారత్, పాక్ యుద్ధం చేయాలని భావించాయని,అయితే ఆ రెండు దేశాలను టారిఫ్‌తో బెదిరించినట్లు ట్రంప్ పేర్కొన్నారు. ఒకవేళ మీరు ఇలాగే పోరాడితే అప్పుడు మీపై 200 శాతం పన్ను విధిస్తానని హెచ్చరించినట్లు ట్రంప్ చెప్పారు. పన్ను విధిస్తామని బెదిరించగానే డబ్బు గురించి వెనుకడుగు వేశారని, డబ్బును మించిందని లేదని, డబ్బును కోల్పోవాల్సి వస్తే అప్పుడు తాము యుద్ధం చేయలేమన్నారని, ఆ ఫైట్‌లో 11 యుద్ధ విమానాలు కూలాయని, చాలా ఖరీదైన జెట్స్ ఉన్నట్లు ట్రంప్ తెలిపారు.ఆపరేషన్ సింధూర్ సమయంలో జెట్స్ కూలిన అంశంలో ట్రంప్ తన సంఖ్యను పెంచుతూ పోతున్నారు. ఇప్పటికే ఈ అంశం గురించి సుమారు 80 కన్నా ఎక్కువ సార్లు మాట్లాడారు. తొలుత 5 , ఆ తర్వాత 7, ఇప్పుడు ఏకంగా 11 యుద్ధ విమానాలు కూలినట్లు ట్రంప్ చెప్పారు. ఇంతకీ ట్రంప్ వ్యాఖ్యల్లో ఎంత నిజం ఉందో స్పష్టంగా తెలియడంలేదు. భారత్ మాత్రం డీజీఎంవో స్థాయి చర్చలతోనే ఆ యుద్ధానికి బ్రేక్ వేసినట్లు చెప్పింది.

# పిల్లల లైంగిక వీడియోలు రికార్డ్ చేసి అమ్మకం.

**దంపతులకు మరణశిక్ష**



**లక్నో- ఫిబ్రవరి 20 (మహాప్రభ )**
పిల్లలను లైంగికంగా వేధించడంతోపాటు లైంగిక వీడియోలు రికార్డ్ చేసి విదేశీయులకు, డార్క్ వెబ్‌లో అమ్మారు. సీబీఐ దర్యాప్తు చేసిన ఈ కేసులో అరెస్టైన భార్యాభర్తలకు పోక్సో కోర్టు మరణశిక్ష విధించింది. (ఎశీబజూశ్రీవ ంవత్‌వఅఎవ౧ ౯శీ ౧మ్ఘ్త్ర) బాధిత కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున ఆర్థిక సహాయం అందించాలని రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలను ఆదేశించింది. ఉత్తరప్రదేశ్‌లోని చిత్రకూట్ జిల్లాకు చెందిన నీటిపారుదల శాఖలో జూనియర్ ఇంజినీర్ రామ్ భవన్, అతడి భార్య దుర్గావతి పిల్లలపై లైంగిక వేధింపులకు పాల్పడ్డారు. చిత్రకూట్, బందాతోపాటు సమీప జిల్లాలకు చెందిన ఐదు నుంచి 16 ఏళ్ల పిల్లలను మభ్యపెట్టి ఆకట్టుకున్నారు. వారితో లైంగిక చర్యలను వీడియో రికార్డ్ చేశారు. విదేశీయులతో పాటు డార్క్ వెబ్‌లో ఆ వీడియోలు అమ్మారు. లక్షల్లో డబ్బు సంపాదించారు.కాగా, కలకలం రేపిన ఈ ఆరోపణలపై సీబీఐ దర్యాప్తు చేసింది. రామ్ భవన్ ఇంట్లో సోదాలు చేసింది. రూ.8 లక్షల నగదు, 12 మొబైల్ ఫోన్లు, రెండు ల్యాప్‌టాప్‌లు, ఒక హార్డ్ డిస్క్, ఆరు పెన్ డ్రైవ్‌లను స్వాధీనం చేసుకుంది. ఆ పరికరాల్లో పెద్ద సంఖ్యలో పిల్లల లైంగిక వేధింపు వీడియోలు ఉన్నట్లు ఫోరెన్సిక్ పరీక్షలో నిర్ధారణ అయ్యింది. ఎన్‌క్రిప్టెడ్ ప్లాట్‌ఫారమ్‌లు, డార్క్‌నెట్ ఛానెల్‌ల ద్వారా విదేశీయులకు చైల్డ్ పోర్న్ వీడియోలు అమ్మినట్లు దర్యాప్తులో తేలింది. మరోవైపు 2020 అక్టోబర్‌లో రామ్ భవన్, అతడి భార్య దుర్గావతిని సీబీఐ అధికారులు అరెస్ట్ చేశారు. పోక్సో చట్టం, సమాచార సాంకేతిక చట్టంలోని సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ఈ కేసుకు సంబంధించి ఢిల్లీకి చెందిన ఒక వ్యక్తిని కూడా పోలీసులు అరెస్టు చేశారు.అయితే బందాలోని పోక్సో కోర్టు ఆరేళ్లుగా ఈ కేసుపై విచారణ జరిపింది. చివరకు శుక్రవారం తీర్పు ఇచ్చింది. భార్యాభర్తలైన రామ్ భవన్, దుర్గావతిని దోషులుగా నిర్ధారించి మరణశిక్ష విధించింది. బాధిత కుటుంబాలకు రూ. 10 లక్షల చొప్పున ఆర్థిక సహాయం అందించాలని రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలను కోర్టు ఆదేశించింది.

# పాక్‌లో డజన్ అరటి పండ్లు రూ.300



**న్యూఢిల్లీ - ఫిబ్రవరి 20 (మహాప్రభ )**
మరోసారి పాకిస్థాన్ ఆర్థిక సంక్షోభంపై చర్చ తెరపైకి వచ్చింది. పవిత్రమైన రంజాన్ మాసంలో పాకిస్థాన్‌లో ధరలు మండిపోతున్నాయి. అంతకుముందు తీవ్ర ద్రవ్యోల్బణంతో నిత్యావసర సరుకుల రేట్లు పెరిగిపోగా..తాజాగా పండుగ పూట పండ్లు, కూరగాయాల ధరలు ఆకాశాన్నంటాయి. డజన్ అరటి పండ్లు పాక్ కరెన్సీలో రూ.300 అమ్ముతున్నారు. క్విన్నో, ఆరెంజ్‌లు కిలో రూ.350 నుంచి రూ.400 పలుకుతున్నాయి. స్ట్రాబెర్రి కిలో రూ.1000, ద్రాక్ష, దానిమ్మ కిలో రూ.700 నుంచి 750లకు ఆయా మార్కెట్‌లో లభ్యమైతున్నాయని ఆ దేశ ది ఎక్స్‌ప్రెస్ ట్రిబ్యూన్ పేర్కొంది. హఠాత్తుగా పెరిగిన ఆ ధరలతో ఆ దేశ వాసులు మండిపడుతున్నారు. పరిపాలనా అసమర్థత, పెరుగుతున్న అధిక ద్రవ్యోల్బణం బంబుతో పవిత్ర మాసం ప్రారంభమైందని విమర్శిస్తున్నారు.

# మార్చి 31 నుంచి ఏప్రిల్ 2 వరకు ట్రంప్ చైనా పర్యటన



**వాషింగ్టన్ - ఫిబ్రవరి 20 (మహాప్రభ )**
ప్రపంచం ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ చైనా పర్యటన ఖరారైంది. మార్చి 31 నుంచి ఏప్రిల్ 2 వరకు ట్రంప్ చైనాలో పర్యటించనున్నారు. ఈ విషయాన్ని వైట్ హౌస్ అధికారి శుక్రవారం తెలిపారు. ఈ పర్యటనలో భాగంగా ట్రంప్ చైనా అధ్యక్షుడు జి జిన్‌పింగ్‌ను కలవనున్నట్లు చెప్పారు. అయితే ఈ చర్చలో చర్చించే అంశాలను గురించి వివరాలు చెప్పడానికి అధికారి నిరాకరించారు. ఏదైమైనా ప్రపంచంలోనే రెండు అతిపెద్ద ఆర్థిక వ్యవస్థల అధ్యక్షులు భేటీ కావడం ప్రాధాన్యతను సంతరించుకుంది. కాగా, చైనా పర్యటన గురించి ట్రంప్ గురువారమే వ్యాఖ్యానించారు.

# ఏప్రిల్ 1 నుంచి నగదు చెల్లింపులు బంద్

**హైవే టోల్స్‌లో ఇక పూర్తిగా డిజిటల్ వసూళ్లు**





**న్యూఢిల్లీ - ఫిబ్రవరి 20 (మహాప్రభ )**
సంపూర్ణ డిజిటల్ టోలింగ్ పర్యావరణ వ్యవస్థను సృష్టించే లక్ష్యంతో దేశవ్యాప్తంగా ఉన్న జాతీయ రహదారి టోల్ ప్లాజాల్లో ఈ ఏడాది ఏప్రిల్ 1 నుంచి నగదు చెల్లింపులను నిలిపివేయాలని కేంద్ర ప్రభు త్వం యోచిస్తున్నది. ఈ ప్రతిపాదన అమల్లోకి వస్తే టోల్ లావాదేవీలన్నీ ఫాస్టాగ్, యూపీఐ వంటి ఎలెక్ట్రానిక్ విధానాల ద్వారా మాత్ర మే జరుగుతాయి.నగదును ఎట్టి పరిస్థితుల్లో అంగీకరించరు. సాంకేతిక ఆధారిత పరిష్కారాల ద్వారా నిర్వాహక సామర్థ్యాన్ని విస్తరించడం, ట్రాఫిక్ ప్రవాహాన్ని మెరుగుపరచడం, హైవే మౌలిక సదుపాయాలను ఆధునీకరించడం వంటి విస్తృత వ్యూహంలో భాగంగా నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా(ఎన్‌హెచ్ఏఐ) ప్రస్తుతం ఈ మార్పును అంచనా వేస్తున్నది.

# ట్రేడ్ డీల్‌పై మార్చిలో సంతకాలు!




**న్యూఢిల్లీ - ఫిబ్రవరి 20 (మహాప్రభ )**
భారత్, అమెరికా మధ్య తాత్కాలిక వాణిజ్య ఒప్పందంపై ఈ ఏడాది మార్చిలో సంతకాలు జరిగే అవకాశం ఉందని, ఈ ఒప్పందం ఏప్రిల్ నుంచి అమల్లోకి వస్తుందని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రి పియూష్ గోయల్ శుక్రవారం వెల్లడించారు. బ్రిటన్, ఓమన్‌తో కుదుర్చుకున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు కూడా ఏప్రిల్‌లో కార్యరూపం దాలుస్తాయని, న్యూజిలాండ్‌తో కుదుర్చుకున్న ఒప్పందం సెప్టెంబర్‌లో అమలయ్యే అవకాశం ఉందని ఆయన చెప్పారుతాత్కాలిక వాణిజ్య ఒప్పందానికి చెందిన చట్ట నిబంధనలను ఖరారు చేసేందుకు భారత్, అమెరికా అధికారుల మధ్య మూడు రోజుల పాటు జరిగే సమావేశాలు ఈ నెల 23న అమెరికాలో ప్రారంభమవుతాయని గోయల్ చెప్పారు.

# పాక్స్ సిలికాలో భారత్ చేరిక




**న్యూఢిల్లీ - ఫిబ్రవరి 20 (మహాప్రభ**
కీలక ఖనిజాలు, కృత్రిమ మేధ కోసం అమెరికా నేతృత్వంలోని వ్యూహాత్మక కూటమి 'పాక్స్ సిలికా'లో భారత్ శుక్రవారం సభ్య దేశంగా చేరింది. న్యూఢిల్లీలోని భారత్ మండపంలో జరుగుతున్న ఏఐ ఇంపాక్ట్ సదస్సులో నిర్వహించిన ఓ కార్యక్రమంలో భారత్ కూటమిలో చేరే ఒప్పందంపై సంతకం చేసింది.ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్, భారత్‌లోని అమెరికా రాయబారి సెర్గియో కోర్ తదితరులు పాల్గొన్నారు. పాక్స్ సిలికా అనేది సామర్థ్యాల కూటమిగా కోర్ అభివర్ణించారు. పాక్స్ సిలికా దేశాలదే భవిష్యత్తు అవుతుందని జాకబ్ హెల్‌బర్గ్ అన్నారు.

## పాక్ సైనికుల్ని నిర్బంధించిన బీఎల్ఏ ఆర్మీ..

- తమ వాళ్లే కాదంటున్న పాక్..
- ఐడీలు చూపిన పాక్ సైనికు బంధీలు
- తాము దేశం కోసం ప్రాణాలిచ్చేందుకు సిద్ధమైతే..
- తమ దేశం కనీసం తమను పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం

న్యూఢిల్లీ,



పాకిస్తాన్ సైన్యానికి, బలూచ్ లిబరేషన్ ఆర్మీ (బీఎల్ఏ) కి మధ్య నడుస్తున్న సైనికుల కిడ్నాప్ అంశం కీలక మలుపు తిరిగింది. బీఎల్ఏ ఆధీనంలో ఉన్న సైనికులు తమ వాళ్లు కాదని పాకిస్తాన్ ఆర్మీ ప్రకటించింది. దీంతో బీఎల్ఏ చెరలో ఉన్న పాక్ సైనికులు తమ ఐడీలు చూపించారు. పాక్ ఆర్మీ తమను పట్టించుకోకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. జనవరి చివరి వారంలో పాక్ సైన్యంపై బీఎల్ఏ మెరుపు దాడులు చేసిన సంగతి తెలిసిందే. ఈ దాడుల్లో పాక్ సైనికులు, బీఎల్ఏ సభ్యులు కూడా మరణించారు. రెండువైపులా కొందరినీ ఆధీనంలోకి తీసుకున్నారు. ఈ దాడుల సందర్భంగా బీఎల్ఏ సభ్యుల్ని పాక్ ఆర్మీ అరెస్ట్ చేస్తే.. కొందరు పాక్ సైనికుల్ని బీఎల్ఏ కిడ్నాప్ చేసింది. తమ ఆధీనంలో ఏడుగురు పాక్ సైనికులు ఉన్నట్లు ఇటీవల బీఎల్ఏ ప్రకటించింది. బంధీలుగా ఉన్న పాకిస్తాన్ సైనికులకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు కూడా విడుదల చేసింది. వారిని విడుదల చేయాలంటే పాకిస్తాన్ ఆర్మీ అరెస్టు చేసిన తమ వారిని విడుదల చేయాలని బీఎల్ఏ డిమాండ్ చేసింది. లేకుంటే తమ ఆధీనంలో ఉన్నవారిని చంపేస్తామని హెచ్చరించింది. ఇందుకు ఈ నెల 22 వరకు గడువిచ్చింది. అంటే ఇంకా రెండు రోజులే ఉంది. అయితే, ఈ విషయంలో పాకిస్తాన్ భిన్నంగా స్పందించింది. తమ సైనికులకు సంబంధించి ఎవరూ మిస్ కాలేదని తెలిపింది.అంతేకాదు.. బీఎల్ఏ ఆధీనంలో ఉన్నవారు తమ సైనికులే కాదని తేల్చిచెప్పింది. దీంతో బంధీలుగా ఉన్న పాక్ సైనికులు షాకయ్యారు. తమకు సంబంధించిన ఐడీలు చూపిస్తూ వీడియో విడుదల చేశారు. ఈ ఐడీ కార్డు పాక్ ప్రభుత్వమే జారీ చేసిందన్నారు. తాము పాక్ సైనికులం కాకుంటే మరెవరని ప్రశ్నించారు. తమ కుటుంబ పరిస్థితి గురించి వివరించారు. తాము దేశం కోసం ప్రాణాలిచ్చేందుకు సిద్ధమైతే.. తమ దేశం కనీసం తమను పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ అంశం చివరకు ఎటు వెళ్తుందో చూడాలి.

## బంగ్లాదేశ్ ప్రభుత్వం కీలక నిర్ణయం

మొదటి తరువాయి

పునరుద్ధరిస్తున్నట్టు సీనియర్ ఇండియన్ కాన్సులర్ అధికారి న్యూఢిల్లీలో గురువారంనాడు ప్రకటించారు. ఈ క్రమంలో భారతీయ పౌరులకు వీసా సర్వీసులను ఢిల్లీలోని బంగ్లాదేశ్ హై కమిషన్ శుక్రవారంనాడు పునరుద్ధరించింది. కొద్దికాలం క్రితం భారత వ్యతిరేక యువనేత షరీఫ్ ఒస్మాన్ హదీ హత్యకు గురికావడం బంగ్లాదేశ్‌లో తీవ్ర ఉద్రిక్తతలకు దారితీసింది. హదీ హత్యానంతరం హిందూ మైనారిటీలపై దాడులు, హత్యాకాండలు చోటుచేసుకున్నాయి. దీంతో ఇరుదేశాల మధ్య సంబంధాలు క్షీణించాయి. గత డిసెంబర్ నుంచి భారత్-బంగ్లా మధ్య వీసా సర్వీసులు నిలిచిపోయాయి. అయితే యూనస్ తాత్కాలిక ప్రభుత్వం తప్పుకోవడం, ప్రజాస్వామ్యబద్ధంగా తారిఖ్ రెహ్మాన్ ఎన్నికకావడంతో భారత్-బంగ్లా మధ్య సంబంధాల పునరుద్ధరణకు సానుకూల సంకేతాలు వెలువడుతున్నాయి.

## 15 రోజుల్లో తేల్చాలి..

మొదటి తరువాయి

ఒకవేళ ఈలోగా ఒక ఒప్పందానికి రాకపోతే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించాడు. "ఇరాన్‌తో అణు ఒప్పందం అంత సులభం కాదని కొన్నేళ్లుగా అర్థమైంది. అయితే, మేం తప్పకుండా అణు ఒప్పందం చేసుకుని తీరాలి. లేకుంటే ఇరాన్ విషయంలో ఎలాంటి పరిణామాలైన జరగవచ్చు. పది రోజుల్లో సరైన ఫలితం కనిపించాలి" అని ట్రంప్ వ్యాఖ్యానించాడు. ఇరు దేశాలూ ఇలా చర్చలు అంటున్నా ఎవరికి వారు యుద్ధ సన్నాహాల్లో ఉన్నారు. ఈ ప్రాంతంలో అమెరికా సైనిక చర్యలు ప్రారంభించింది. మధ్యధరా సముద్రంలో ఎయిర్ క్రాఫ్ట్ క్యారియర్ (యుద్ధనౌక)ను మోహరించింది. ఈ ప్రాంతంలో సైనిక చర్య చేపట్టాలంతే తగినంత పూర్తిస్థాయి సైన్యం కావాలని సీనియర్ ఆర్మీ అధికారులు అంటున్నారు. మార్చి నెల మధ్యలో ఈ చర్యలకు అవకాశం ఉందని భావిస్తున్నారు.ఇదే సమయంలో ఇరాన్ కూడా తన ఆయుధాల్ని సిద్ధం చేస్తున్నట్లు కనిపిస్తోంది. అణ్వాయుధాల విషయంలో ఇటీవలే జెనీవాలో ఇరాన్-అమెరికా మధ్య కొన్ని చర్చలు జరిగాయి. ఇరాన్ అణ్వాయుధాల తయారీని ఆపాలని అమెరికా డిమాండ్ చేస్తోంది. కానీ, దీనిపై చర్చించేందుకు ఇరాన్ నిరాకరించింది. ఇదే సమయంలో అమెరికా, ఇజ్రాయెల్ కలిపి ఇరాన్‌పై దాడి చేస్తాయనే ప్రచారం జరుగుతోంది. మరోవైపు రష్యాతో కలిసి ఇరాన్ నావికా విన్యాసాలు నిర్వహించింది. అగ్రదేశాలు ఇలాంటి చర్యలకు దిగుతుండటంతో ఈ ప్రాంతంలో ఉద్రిక్తతలు పెరుగుతున్నాయి.

## ఎప్రిల్‌లో తెలంగాణలో సర్ ప్రక్రియ

మొదటి తరువాయి

రాబోయే ఎస్ఐఆర్‌ను సమర్థవంతంగా నిర్వహించేందుకు అవసరమైన సన్నాహకాలను సమయానికి పూర్తి చేయాలని సుదర్శన్ రెడ్డి అధికారులకు దిశానిర్దేశర చేశారు. ఓటరు జాబితాల స్వచ్ఛతను కాపాడటంలో ఏఈఆర్ఓల పాత్ర అత్యంత కీలకమని ఆయన స్పష్టం చేశారు. న్నికల పక్రియను పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు ఈ శిక్షణ కార్యక్రమాలు దోహదం చేస్తాయని అధికారులు తెలిపారు.

## హిందూ మహా సముద్ర రక్షణే లక్ష్యం


మొదటి తరువాయి

నౌకాదళాధిపతులు, సముద్ర భద్రతా సంస్థల ప్రతినిధులు ఈ సమావేశానికి శుక్రవారం హాజరయ్యారు.

# తెలంగాణలో ఏఐ స్టార్టప్ విలేజ్

మొదటి తరువాయి

జాతీయ భద్రత వంటి అంశాలను సమగ్రంగా నిర్వహించేందుకు ప్రత్యేక వ్యవస్థ అవసరమని తెలిపారు. శుక్రవారం న్యూఢిల్లీలోని భారత్ మండపంలో 'ఇండియా-ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ 2026'లో సీఎం రేవంత్ కీలక ప్రసంగం చేశారు. దేశ, విదేశాల నుంచి విచ్చేసిన విధానకర్తలు, సాంకేతిక నిపుణులు, పారిశ్రామిక దిగ్గజాలనుద్దేశించి ప్రసంగించారు. "మానవజాతి సాధించిన అత్యున్నత ఆవిష్కరణ కృత్రిమ మేధ (ఏఐ). గతంలో నిప్పును కనుగొన్నప్పుడు, చక్రాన్ని ఆవిష్కరించినప్పుడు, పారిశ్రామిక విప్లవం వచ్చినప్పుడు ప్రపంచం ఎలాంటి పెను మార్పులకు లోనైందో.. ఇప్పుడు ఏఐ వల్ల కూడా అలాంటి పరివర్తనాత్మక క్షణాలను మనం చూస్తున్నాం" అని అన్నారు. విద్యుత్, ఇంటర్నెట్ వంటి ఆవిష్కరణలు ప్రపంచాన్ని ఎలా మార్చేశాయో ఏఐ కూడా అలాంటి విప్లవాత్మక సాంకేతికతేనని పేర్కొన్నారు. ఇది కేవలం ఇంకొక టెక్నాలజీ మాత్రమే కాదని, మానవ పరిణామ క్రమంలో అత్యంత శక్తివంతమైన మలుపు అని తెలిపారు. మునుపటి యంత్రాల మాదిరిగా కాకుండా ఏఐ స్వయంగా నేర్చుకోగలదని, విశ్లేషించగలదని, నిర్ణయాలు తీసుకోగలదని చెప్పారు.




జమనిషి మేధస్సుకే సవాల్..


'గతంలోని ఆవిష్కరణలు మనిషి శారీరక శ్రమను తగ్గిస్తే, ఏఐ నేరుగా మనిషి మేధస్సుకే సవాల్ విసురుతోంది. స్వయం ప్రతిపత్తి, నిర్ణయాధికారం కలిగిన ఏఐ.. రోబోటిక్స్‌కు తోడైతే అద్భుతాలు సృష్టిస్తుంది" అని సీఎం రేవంత్ అన్నారు. ఏఐతో పోటీ పడటంలో ప్రపంచం ఇప్పటికే బిజీ అయిపోయిందని, కొన్ని దేశాలు, కంపెనీలు ముందంజలో ఉన్నాయని పేర్కొన్నారు. గత పారిశ్రామిక విప్లవాల సమయంలో జరిగిన అవకాశ నష్టాలను గుర్తు చేస్తూ... ఈసారి భారత్ అలాంటి తప్పిదం చేయకూడదని అన్నారు. సేవలు, సాఫ్ట్‌వేర్ రంగాల్లో విజయం సాధించిన భారత్, ప్రపంచ స్థాయి కోర్ టెక్నాలజీ ఉత్పత్తుల్లో కూడా నాయకత్వం వహించాల్సి ఉందని అభిప్రాయపడ్డారు. ప్రపంచవ్యాప్తంగా ఏఐ పరిణామాలను నిశితంగా పర్యవేక్షించేందుకు కేంద్ర ప్రభుత్వం.. రాష్ట్రాల సమన్వయంతో జాతీయ ఏఐ వార్ రూమ్ ఏర్పాటు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి ప్రతిపాదించారు. సెమీ కండక్టర్ చిప్ తయారీ, జీపీయూ సామర్థ్యాలు, డేటా సెంటర్లు, గ్రీన్ ఎనర్జీ వినియోగం, ఏఐ ప్లాట్‌ఫాంలు, అప్లికేషన్లలో భారత్ స్పష్టమైన వ్యూహంతో ముందుకు సాగాలని సూచించారు. కేంద్రం అనుమతిస్తే హైదరాబాద్‌లో అలాంటి వార్ రూం నిర్వహించేందుకు తెలంగాణ సిద్ధంగా ఉందని ప్రకటించారు.

# ఏలియన్స్ గుట్టు బయటపెడతాం

**-వాటికి సంబంధించిన ఫైళ్లను వెల్లడిస్తాం**
**-అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వెల్లడి**

వాషింగ్టన్,

అమెరికాలో ఏలియన్స్, యూఎఫ్ఓ లకు సంబంధించిన ప్రభుత్వ ఫైళ్లను విడుదల చేసే పక్రియను ప్రారంభించాలని ఆ దేశ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆదేశించారు. గ్రహాంతరవాసులు, గుర్తుతెలియని ఎగిరే వస్తువులకు సంబంధించిన రహస్య ఫైళ్లను గుర్తించి.. వాటిని బహిర్గతం చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ట్రంప్ తీసుకున్న ఈ సంచలన నిర్ణయంతో గ్రహాంతర వాసుల ఉనికిపై దశాబ్ద కాలంగా సాగుతున్న అమెరికన్ల ఉత్కంఠకు తెరపడనుంది. ప్రజల్లో ఈ రహస్యాల పట్ల ఉన్న ఆసక్తిని తీర్చాలని భావించే ఈ నిర్ణయం తీసుకున్నట్టు తన ట్రూత్ సోషల్ వేదికగా ట్రంప్ పేర్కొన్నారు. యూఎస్ మాజీ ప్రెసిడెంట్ బరాక్ ఒబామా.. గ్రహాంతరవాసులు ఉన్నారని ఇటీవల ఓ పాడ్‌కాస్ట్‌లో వ్యాఖ్యానించడంతో ఈ వివాదం రాజుకుంది. దీనిపై ఒబామా నాడు మాట్లాడుతూ.. 'గ్రహాంతర వాసులు ఉన్నది నిజమే కావచ్చు. కానీ




నేనెప్పుడూ వారిని చూడలేదు' అని అన్నారు. అమెరికాలోని ఏరియా 51లో వారిని దాచిపెట్టారనే ప్రచారంలో ఎలాంటి వాస్తవమూ లేదని ఆయన వ్యాఖ్యానించారు. తన పదవీ కాలంలో ఏలియన్స్ భూమిపై సంచరించినట్టు ఎలాంటి ఆధారాలూ లభించలేదని స్పష్టం చేశారు. అయితే.. ఈ సమాచారాన్ని ఒబామా బహిర్గతం చేయడాన్ని తప్పుబట్టారు ట్రంప్. క్లాస్గి÷డ్ సమాచారాన్ని బయటపెట్టి ఒబామా పెద్ద తప్పుచేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వైరల్ అయిన ఒబామా 'ఏరియా 51' వ్యాఖ్యలను ట్రంప్ ఉదహరిస్తూ.. 'ఏలియన్స్‌లో ఎవరున్నారో నిజంగా నాకు తెలియదు. కానీ ప్రభుత్వం వద్దనున్న సమాచారాన్ని మాత్రం బయటపెడతాను' అని ట్రంప్ పేర్కొన్నారు. అయితే.. గ్రహాంతర సాంకేతికతకు సంబంధించి తమ వద్ద ఎలాంటి ఆధారాలూ లభించలేదని 2024 మార్చిలో పెంటగాన్ ఓ నివేదికలో పేర్కొంది. రెండో ప్రపంచ యుద్ధం అనంతరం.. వాటికి సంబంధించిన సమాచారమేమీ లేదని.. ఆకాశంలో కనిపించిన వింత వస్తువులు సహజమైనవి కావచ్చని స్పష్టం చేసింది. కానీ దీనిపై ఇప్పుడు ట్రంప్ సెక్రటరీ ఆఫ్ వార్ సహా ఇతర ఏజెన్సీ సంస్థలను రంగంలోకి దింపి ఈ రహస్య పక్రియను ఛేదించేందుకు యత్నించడం చర్చనీయాంశమైంది. అయితే.. ఈ రహస్య పత్రాలను ప్రజల ముందుకు తీసుకువస్తారా లేదా అనే విషయమై ఎలాంటి స్పష్టతనివ్వలేదు ట్రంప్. ఈ్గ÷ళ్లైలో అత్యంత సంక్లిష్టమైన, ఆసక్తికరమైన, ముఖ్యమైన విషయాలకు సంబంధించిన సమాచారం ఏది ఉన్నా బహిర్గతం చేయాలని అధికారులను ఆదేశించారు. ఏది ఏమైనా ట్రంప్ తాజా నిర్ణయంతో.. అంతరిక్షంలో ఉన్న ఇతర జీవుల ఉనికిపై అమెరికా ప్రభుత్వ అధికారిక వైఖరి ఏంటనే దానిపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది. దీంతో ఎన్నో ఖగోళ విషయాలు బయటకు వస్తాయని, చాలా మందికి అంతుచిక్కని ప్రశ్నలకు సమాధానం లభించనుందని శాస్త్రవేత్తల్లో ఆసక్తి నెలకొంది.

# మున్సిపాలిటీలను అభివృద్ధి చేస్తాం

మొదటి తరువాయి

రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు నగేష్‌రెడ్డి, నగర అధ్యక్షులు బొబ్బిలి రామకృష్ణతో కలిసి మంత్రి పాల్గొన్నారు. మేయర్‌గా ఉమారాణి, డిప్యూటీ మేయర్‌గా సల్మా తహసీన్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. స్థానిక ఎన్నికల్లోనూ ప్రజలు కాంగ్రెస్‌ను ఆశీర్వదించాలని ప్రజలను కోరారు. ప్రజల ఆలోచన మేరకు పార్టీ పాలన కొనసాగుతుందన్నారు. తెలంగాణ ఉద్యమకారులను ఆదుకోవడం తమ బాధ్యత అని చెప్పారు. టీపీసీసీ అధ్యక్షులు మాట్లాడుతూ.. ఎన్నికల వరకే రాజకీయాలని, తర్వాత అభివృద్ధి తమ లక్ష్యమని తెలిపారు. నగరంలోని అన్ని డివిజన్లకు సమన్యాయం చేయాలని మేయర్‌కు సూచించారు. సీఎం రేవంత్‌రెడ్డి నిజామాబాద్‌పై ప్రత్యేక దృష్టి సారించారని, అభివృద్ధి కోసం ప్రత్యేక నిధులు ఇవ్వాలని కోరినట్టు తెలిపారు. 60 డివిజన్‌లలో మౌలిక సదుపాయాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ పనులను



వేగవంతంగా పూర్తి చేయాలని, ప్రజలకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ముందుకు సాగాలని తెలిపారు. ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో జిల్లాకు చెందిన టీపీసీసీ అధ్యక్షులు మహేశ్‌కుమార్‌గౌడ్ నేతృత్వంలో మున్సిపల్ కార్పొరేషన్లను మోడల్ కార్పొరేషన్లుగా తీర్చిదిద్దేలా ముందుకు సాగుతున్నామన్నారు. నగర అభివృద్ధే ధ్యేయంగా అన్ని రకాల నిధులు నిజామాబాద్‌కు వచ్చేలా కృషి చేస్తామన్నారు. రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి మాట్లాడుతూ.. జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కట్టుబడి ఉన్నామని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ దిలీప్‌కుమార్, కార్పొరేటర్లు, కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు, తదితరులు పాల్గొని మేయర్‌కు, డిప్యూటీ మేయర్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

# భవిష్యత్‌లో అమరావతి క్వాంటమ్‌పై చర్చిస్తారు

మొదటి తరువాయి

ఢిల్లీలోని భారత్ మండపంలో జరుగుతున్న ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్-2026లో ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు పాల్గొన్నారు. ప్రపంచ క్వాంటమ్ - ఏఐ రంగాలకు చెందిన దిగ్గజ సంస్థల ప్రతినిధులు ఈ సదస్సుకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఐబీఎం సహా వివిధ ప్రముఖ సంస్థలతో సీఎం చంద్రబాబు సమక్షంలో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందాలు కుదుర్చుకుంది. డీప్ టెక్నాలజీ రంగంలో మరింత ముందుకెళ్లేలా తమ ప్రభుత్వం దృష్టి సారిస్తోందని చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. ఏపీలో స్పేస్, డ్రోన్, ఎలక్ట్రానిక్స్, మెడ్‌టెక్ పార్క్ లాంటి ప్రత్యేక పారిశ్రామిక క్లస్టర్లు ఉన్నాయని పేర్కొన్నారు. ఈ రంగాల్లో పెద్దఎత్తున పెట్టుబడులను ఆకర్షించటంతో పాటు.. క్వాంటం ఎకో సిస్టంను తీర్చిదిద్దుతున్నామని వివరించారు. వరల్డ్ ఎకనామిక్ ఫోరం నిర్వహిస్తున్న కృత్రిమ మేధస్సు ద్వారా పోటీతత్వం అంశంపై జరుగుతున్న రౌండ్ టేబుల్ కాన్ఫరెన్స్‌కు సీఎం చంద్రబాబు హాజరై.. తన అభిప్రాయాలను పంచుకు న్నారు. ఈ రౌండ్ టేబుల్ కాన్ఫరెన్స్‌లో కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్, వరల్డ్ ఎకనామిక్ ఫోరం సీఈఓ బోర్కే బ్రెండేతో కలిసి పాల్గొన్నారు. సమీప భవిష్యత్‌లో అమరావతి క్వాంటం వ్యాలీ గురించి ప్రపంచం అంతా మాట్లాడే రోజు వస్తుందని చెప్పుకొచ్చారు. గూగుల్ లాంటి సంస్థల రాకతో ఏపీలోని విశాఖపట్నం ఏఐ డేటా హబ్‌గా మారుతుందని తెలిపారు. ప్రపంచానికి క్వాంటం కంప్యూటింగ్‌కు సంబంధించిన పరికరాలను కూడా తయారు చేసేలా క్వాంటం ఎకో సిస్టం రూపకల్పన చేస్తున్నామని సీఎం చంద్రబాబు అన్నారు. దేశాన్ని అగ్రస్థానంలో నిలబెట్టాలన్న ఆకాంక్షతో ప్రధాని నరేంద్రమోదీ పనిచేస్తున్నారని.. దేశం దాన్ని సాధించి తీరుతుందని అన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అద్భుతాలను సాధిస్తుందనే విశ్వాసం తమకు ఉందని చెప్పుకొచ్చారు. పౌరులందరికీ ప్రయోజనం కలిగేలా సావరిన్ ఏఐని వినియోగించేందుకు ప్రభుత్వ పరంగా ప్రయత్నం చేస్తున్నామని వివరించారు. డీప్ టెక్నాలజీ రంగంలో మరింత ముందుకెళ్లేలా ఏపీ దృష్టి సారిస్తోందని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. ఏపీలో క్వాంటమ్ - ఏఐ రంగాల్లో నైపుణ్యాభి వృద్ధి, మౌలిక వసతుల అభివృద్ధి కల్పించే దిశగా ఏడు ఒప్పందాలు కుదుర్చుకుంది సర్కార్. ఏపీని క్వాంటమ్ - ఏఐ హబ్‌గా తీర్చిదిద్దడం... అమరావతిలోని క్వాంటమ్ వ్యాలీకి జాతీయ, అంతర్జాతీయ స్థాయి గుర్తింపు తెచ్చేలా ప్రభుత్వం ఒప్పందాలు చేసుకుంది. భవిష్యత్ టెక్నాలజీని అందిపుచ్చుకునేలా విద్యార్థులు, యువతకు ఏఐ - క్వాంటమ్ రంగాల్లో శిక్షణ, ప్రభుత్వ శాఖల్లో ఏఐ - క్వాంటమ్ వినియోగం, టెక్నాలజీ ద్వారా ప్రజలకు సేవలను సులభతరం చేయడం వంటి అంశాలపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించింది.

# సంపాదకీయం

## ఎన్నికల ఫలితాలు
## పనితీరుకు గీటురాయి కాదు !



రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఇప్పటి వరకు ప్రయోజనాత్మక నిర్ణయాలు ఇంకా తీసుకోలేదు. అయితే వరుస ఎన్నికల్లో గెలవడం వల్ల అధిష్టానం వద్ద మార్కులు కొట్టేశారు. మంత్రులంతా కలసి కాంగ్రెస్ అగ్రనేతలు ఖర్గే, రాహుల్‌ను కలిసి శహభాష్ అనిపించుకున్నారు. ఇలాగే పనిచేయండని కాంగ్రెస్ అగ్రనేతలు దీవించి పంపారు. ఇది మాత్రమే కాంగ్రెస్ విజయం కాదు. ఢిల్లీలో కూర్చున్న నేతలకు రాష్ట్రం ఎదుర్కొంటున్న సమస్యలపై అవగాహన లేదు. సిఎం రేవంత్ కూడా క్షేత్రస్థాయి సమస్యలపై ఇంకా దృష్టి సారించలేదు. ప్రధానంగా తాగు,సాగునీటి సమస్యలు, రైతుల నుంచి ధాన్యం సేకరణ, గిట్టుబాటు ధరలు అందించడం, నిరుద్యోగ సమస్యలు తీర్చడం వంటివన్నీ ప్రధానంగా వెన్నాడుతున్నాయి. క్షేత్రస్థాయిలో తెలంగాణలో అనేకానేక సమస్యలు వెన్నాడుతున్నాయి. కెసిఆర్ ప్రభుత్వం ఉన్న సమయంలో ఉన్న సమస్యలే ఇంకా ఉన్నాయి. అవేవీ పరిష్కారం కాలేదు. రేవంత్ సర్కార్‌పై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందన్న అభిప్రాయం రాజకీయ వర్గాల్లో బలంగా వ్యాపించిన తరుణంలో మునిసిపల్ ఎన్నికలు జరిగాయి. అంతకు ముందు పంచాయితీ, ఇంకా అంతకుముందు రెండు ఉప ఎన్నికలు జరిగాయి. వీటన్నింటిలో కాంగ్రెస్ విజయం సాధించింది. ఇవన్నీ కూడా కాంగ్రెస్ పాలనకు గీటురాయి కాబోవు. ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్‌ఎస్ రాష్ట్ర ప్రభుత్వంపై కొంత కాలంగా విరుచుకుపడుతోంది. రేవంత్‌రెడ్డి సర్కార్ పనైపోయినట్టేనని ప్రచారం చేస్తోంది. ఆ పార్టీ నాయకులు అది నిజమని కూడా నమ్ముతున్నారు. ఈ ప్రచారానికి తోడు ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు దాటినందున ఇటీవలి వరుస ఎన్నికల ఫలితాలపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. అయితే బిఆర్‌ఎస్ అంచనాకు భిన్నంగా కాంగ్రెస్ పార్టీ మంచి ఫలితాలు సాధించింది. కేటీఆర్,హరీష్ రావులుకు ఈ ఫలితాలు ఓ రకంగా హెచ్చరిక లాంటివి. ఎందుకంటే గత పాలనలో తాము చేసిన పాపాలను పక్కన పెట్టి అదేపనిగా విమర్శలు చేస్తూ పోతే ప్రజలు ఆదరిస్తారని అనుకుంటున్నారు. ప్రజలు అన్ని విషయాలు తెలుసుకుంటున్నారు. ఏవరేమిటో గ్రహిస్తున్నారు. అయితే సిఎం రేవంత్ అందరినీ కలుపుకుని వరుస విజయాలను సాధిస్తున్నారు. కాంగ్రెస్ అంటేనే అసమ్మతి గుర్తుకు వస్తుంది. ఆ పార్టీలో ఎవరికి వారే ముఖ్యమంత్రి స్థాయి నాయకులమని భావిస్తారు. ఏక నాయకత్వాన్ని అంగీకరించరు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఇప్పటికీ తమ నేతగా అంగీకరించడం లేదు. కాంగ్రెస్ పార్టీలో ఆయన జూనియర్ అని పలువురు వ్యాఖ్యానిస్తూనే ఉన్నారు. కాంగ్రెస్‌లో సీనియర్లం అని భావిస్తున్న వాళ్లు రేవంత్‌రెడ్డి నాయకత్వాన్ని ఇప్పటికీ అంగీకరించడం లేదు. లాటరీ తగిలినట్టు రేవంత్‌రెడ్డికి ముఖ్యమంత్రి పదవి దక్కిందని బిఆర్‌ఎస్ చేస్తున్న ముఖ్యంగా కెటిఆర్ చేస్తున్న ఆరోపణఅలను వీరు కూడా భావిస్తున్నారు. కాంగ్రెస్ అధిష్టానం ఎవ్వరినీ నొప్పించకుండా వెళుతోంది. అందుకే కాంగ్రెస్ పార్టీ పరిస్థితి ఎవరికి వారే యమునా తీరే అన్నట్టుగా ఉంది. అయితే, రేవంత్‌రెడ్డి మాత్రం వ్యూహాత్మకంగా పార్టీలో, ప్రభుత్వంలో తన స్థానాన్ని సుస్థిరం చేసుకుంటూ, అగ్ర నాయకకతంవ ముందు మార్కులు కొట్టేస్తున్నారు. సందర్భం వచ్చినప్పుడు తనకున్న పట్టు ఏమిటో నిరూపించుకుంటున్నారు. మునిసిపల్ ఎన్నికల్లో మంత్రులందరికీ జిల్లాల వారీగా బాధ్యతలు అప్పగించి సమన్వయం చేసుకొని సత్ఫలితాలను సాధించారు. దాదాపు అన్ని జిల్లాల్లోనూ మంచి ఫలితాలను సాధించేలా రేవంత్‌రెడ్డి వ్యూహ రచన చేశారు. తనకంటే ఎంతో మంది సీనియర్లున్న కాంగ్రెస్‌ను ఏక తాటిపై నడిపించడంలోనూ రేవంత్‌రెడ్డి కృతకృత్యులయ్యారు. కాంగ్రెస్ సీనియర్లు కూడా తన నాయకత్వాన్ని అంగీకరించక తప్పని పరిస్థితిని కల్పిస్తూ వస్తున్నారు. రాజకీయాల్లో పార్టీలకైనా, నాయకులకైనా ఎన్నికల ఫలితాలే గీటురాయి. మొన్న పంచాయతీ ఎన్నికలు, నిన్న మునిసిపల్ ఎన్నికల్లో 60 శాతంపైగా స్థానాలను కైవసం చేసుకోవడం ద్వారా తన నాయకత్వ విషయంలో ఎదురవుతున్న ఆటంకాలను ఆయన అధిగమిస్తూ వచ్చారు. ఈ ఫలితాలతో పాటు తెలంగాణలో చోటు చేసుకుంటున్న రాజకీయ పరిణామాలు ముఖ్యమంత్రిలో ఆత్మవిశ్వాసాన్ని పెంచుతున్నట్టుగా ఉంది. తాజాగా కాంగ్రెస్ అగ్రనాయకత్వం కూడా రేవంత్ భుజం తట్టి ప్రోత్సహించింది. శహభాష్ అంటూ పొగిడింది. ఇలాగే నడవండి అంటూ అందరినీ కలిపి సూచించింది. అయితే ఇవొక్కటే రేపటి గెలుపునకు బాటలు వేయవు. గుణాతమక మార్పులు రావాలి. చిన్నచిన్న సమస్యలను కూడా పరిష్కరించడం లేదు. మంత్రులు వసూల్ రాజాలుగా మారారని పుంఖానుపుంఖానుగా ఆరోపణలు వస్తున్నాయి. పర్సంటేజీలకు అలవాటు పడ్డారని అంటున్నారు. ప్రభుత్వంలో సమన్వయం, జవాబుదారీతనం పెంపొందించాలి. అదే సమయంలో ప్రభుత్వంలో వివిధ స్థాయిల్లో అవినీతి పెచ్చరిల్లుతోంది. ప్రభుత్వ యంత్రాంగంలో అవినీతిని తగ్గించడానికి వెంటనే చర్యలు తీసుకోవాలి. మంత్రుల తీరు కూడా ఎవరికి వారే యమునా తీరే అన్నట్టుగా ఉంటోంది. ఈ అంశంపై కూడా ముఖ్యమంత్రి దృష్టి సారించాలి. ఉద్యోగుల్లో లంచావతారాలు పెరిగాయి. విద్యుత్ శాఖలో ఏకబిగిన ఓ 9మందిని సస్పెండ్ చేశారు. రోజుకోచోట్ ఎక్కడో ఒక ఉద్యోగి లంచం తీసుకుంటూ పట్టుబడుతున్నాడు. ఈ సమస్య పోవాలి. గంజాయి బ్యాచ్‌లను నిరోధించాలి. అయితే ఇల్లు అలకగానే పండుగ కాదు. స్థానిక సంస్థల ఎన్నికల్లో మంచి ఫలితాలు సాధించినంత మాత్రాన సార్వత్రిక ఎన్నికల్లోనూ ఇవే ఫలితాలు పునరావృతం అవుతాయని భావించడానికి లేదు. ఈ ఫలితాలు ప్రభుత్వంలో, పార్టీలో రేవంత్‌రెడ్డి స్థానం మరింత పటిష్ఠమవడానికి మాత్రమే ఉపయోగపడతాయి. సార్వత్రిక ఎన్నికలకు ఇంకో మూడేళ్ల వ్యవధి ఉంది. 2029లో జమిలి ఎన్నికలు వస్తాయని చెబుతున్నారు. అది నిజమైతే బీఆర్‌ఎస్‌కు మైనస్ అవుతుంది. వచ్చే మూడేళ్లలో ప్రభుత్వం పట్ల ప్రజల్లో వ్యతిరేకత ఏర్పడకుండా జాగ్రత్తలు తీసుకోగలగాలి. అందుకు కార్యాచరణ అవసరం.

# హబ్సిపూర్ గ్రామంలో కూరగాయలు, గొర్ల మేకల సంత ప్రారంభం చేసిన గ్రామ సర్పంచ్



**దుబ్బాక – ఫిబ్రవరి 20 (మహాప్రభ )**
దుబ్బాక సంతను తలపించే విధంగా అబ్సిపూర్ గ్రామంలో జరుగుతున్న కూరగాయల సంతను అభివృద్ధి చేస్తామని గ్రామ సర్పంచ్ శ్రీలత రామచంద్రారెడ్డి, ఉప సర్పంచ్ బోల్గం ప్రవీణ్ గౌడ్ అన్నారు. సిద్దిపేట జిల్లా దుబ్బాక మండల పరిధిలోని అబ్సిపూర్ గ్రామంలో కూరగాయలు పండించే రైతుల సౌలభ్యం కొరకు ఆలోచించి గురువారం కూరగాయలు, గొర్లు, మేకల సంతను గ్రామ సర్పంచ్ బాలేముల శ్రీలత రామచంద్రారెడ్డి, గ్రామ ఉపసర్పంచ్ బోల్గం ప్రవీణ్ గౌడ్, పాలకవర్గం కృషితో కూరగాయల సంతను ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్ రైతులు మాట్లాడుతూ గ్రామంలో కూరగాయలు నూతన ప్రారంభించుకోవడం చాలా సంతోషంగా ఉందని మా చిన్నతనంలో ఇక్కడ కూరగాయలు మార్కెట్ ఉండేదని మళ్లీ ఇప్పుడు పూర్వ వైభవం రావడం పట్ల గ్రామ రైతులు గ్రామ సర్పంచ్ కి , పాలకవర్గానికి ప్రత్యేకత కృతజ్ఞతలు తెలుపుతున్నామని అన్నారు. ఈ సంతను ఇదేవిధంగా ప్రతి గురువారం కొనసాగేలా మరింత అభివృద్ధి జరిగేలా చుట్టుప్రక్కల గ్రామాల రైతుల వచ్చేలా చూస్తామని ఈ సంత విజయవంతం అయ్యేలా ప్రతి ఒక్కరం తోడ్పడుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బాలెంల శ్రీలత రామచంద్రారెడ్డి, ఉప సర్పంచ్ బోల్గం ప్రవీణ్ గౌడ్, వార్డు మెంబర్స్ పులిమామిడి కృష్ణవేణి, బొంగురం ఎల్లారెడ్డి, మల్లీ రజిత , నర్సాగళ్ళ బాబు, జోగు సుదిష్ట, బాయికాడి రాజేందర్ రెడ్డి, జోగురేఖ, కోక్కడ గళ్ళ రమేష్, కొమ్ము దివ్య, దుబ్బాక ఎస్ ఐ, కీర్తి రాజు, దుబ్బాక ఎంపీడీఓ వేలేటి భాస్కర్ శర్మ, గ్రామ సెక్రెటరీ వజ్రవ్వ, గ్రామ యువత తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## విబిజి రామ్ జీ అనే చట్టానికి ప్రతి ఒక్కరు అమలు చేయాలని పోస్టర్ ఆవిష్కరణ.

-బిజెపి జిల్లా అధ్యక్షులు వాల్దాస్ మల్లేష్ గౌడ్..



**మెదక్**
మెదక్ జిల్లా పార్టీ కార్యాలయంలో మెదక్ పార్లమెంట్ సభ్యులు మాధవనేని రఘునందన్ రావు సూచన మేరకు మెదక్ జిల్లా బిజెపి అధ్యక్షుడు వాల్దాస్ మల్లేష్ గౌడ్ ఆధ్వర్యంలో నూతన ఉపాధి హామీ పథకం గురించి దుష్ప్రచారాలను నమ్మొద్దని మోడీ నాయకత్వాన్ని బలపరచాలన్నారు.వికసిత భారత్ లక్ష్యంగా వి బి జి రామ్ జి అనే చట్టానికి ప్రతి ఒక్కరూ మద్దతు ఇవ్వాలని కోరుతూ వాల్ పోస్టర్ ఆవిష్కరణ చేయడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఈర్ల రంజిత్ రెడ్డి, జిల్లా బీజేపీ ఉపాధ్యక్షులు, రామాయం పేట్ కౌన్సిలర్ శంకర్ గౌడ్, మెదక్ జిల్లా బీజేపీ మాజీ ప్రధాన కార్యదర్శి నల్లాల విజయ్, జిల్లా కార్యదర్శి కల్కి నాగరాజు, నగేష్ ,వేణు తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి పనులనుపరిశీలించిన తిమ్మాపూర్ సర్పంచ్



**దుబ్బాక – ఫిబ్రవరి 20 (మహాప్రభ )**
వేసవికాలం సమీపిస్తున్న వేల ఉపాధి హామీ కూలీలు ఎదుర్కొంటున్న సమస్యలను సర్పంచ్ గుర్రాల శ్రీనివాస్ అడిగి తెలుసుకున్నారు. సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలం తిమ్మాపూర్ గ్రామంలో కూలీలు చేస్తున్న ఉపాధి పనులను ఆయన పరిశీలించారు. కూలీల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి కూలీలకు బిల్లులు సకాలంలో పడుతున్నాయా అని అడిగారు. వేసవికాలంలో పని ప్రదేశంలో నీటి సౌకర్యం కల్పించాలని ఫీల్డ్ అసిస్టెంట్ అంతయ్యకు సూచించారు. ఫస్ట్ ఎయిడ్ బాక్స్ అందుబాటులో ఉంచాలని, ప్రతి ఒక్కరు లేబర్ కార్డు అప్లై చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గుర్రాల శ్రీనివాస్ వార్డ్ మెంబర్లు రమేష్ రెడ్డి, కనకయ్య, ముదిరాజ్ సంఘము అధ్యక్షులు జోరబొంతల ప్రభాకర్, కడతాల నర్సారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# సిద్దిపేట జిల్లాలో వ్యక్తి దారుణం హత్య



**దుబ్బాక – ఫిబ్రవరి 20 (మహాప్రభ )**
సిద్ధిపేట జిల్లాలో దారుణం హత్య చోటు చేసుకుంది దుబ్బాక మున్సిపాలిటీ పరిధిలోని చెల్లాపూర్ వార్డుకు చెందిన వంగ బాల్ రెడ్డి రాజక్క పేట గ్రామ శివారులో హత్యకు గురయ్యారు విషయం తెలుసుకున్న స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు విచారణ చేపట్టారు చేపట్టారు బాల్ రెడ్డి పై ఎవరు దాడి చేసి హత్య చేశారనే కోణంలో దర్యాప్తు ప్రారంభించారు. హత్య జరిగిన విషయం స్థానికులకు తెలవడంతో పెద్ద ఎత్తున ఘటన స్థలానికి చేరుకొని హత్య జరిగిన విధానాన్ని చూసి ఉలిక్కిపడ్డారు. దుబ్బాక నియోజకవర్గం వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ నాయకుడు బాల్ రెడ్డి హత్య చర్చనీయాంశంగా మారింది.

## ఎంపీడీవో డోర్ టు డోర్ చేత్త సేకరణ కోసం కొత్త e-auto అందవేత



**ఫిబ్రవరి 20 (తడ మండలం) మహాప్రభ**
తడ మండలంలోని పెరియావట్టు గ్రామ పంచాయతీ లో డోర్ టు డోర్ చేత్త సేకరణ కోసం కొత్త వ-ఖబ్శీ ను ప్రారంభించడం జరిగింది. ప్రభుత్వం ఆశయాల సాధన కోసం గ్రామ పంచాయతీలు పనిచేయాలని 100% శాతం పారిశుధ్యం కార్యక్రమాలు చేపట్టాలని, పంచాయతీ లలో ఎక్కడ చేత్త దిబ్బలు ఉండకూడదు అని ఎంపీడీఓ, సర్పంచ్ గారి కీ మరియు పంచాయతీ కార్యదర్శి గారికి సూచించడం జరిగింది. గ్రామ పంచాయతీ 15వ ఆర్థిక కమిషన్ నిధుల నుండి 2 లక్షలురూపాయలు ఖర్చు చేసినందులకు సర్పంచ్ గారికి మరియు పంచాయతీ కార్యదర్శి గారికి అభినందించడం జరిగింది. మండలం లోని మిగతా పంచాయతీ లు కూడా వ – ఆటోలు కొనుగోలు చేయాలనీ అందరికి తెలియచేయడం జరిగింది.

## వంతడుపుల గ్రామపంచాయతీలో
# గ్రామీణ భాగ్యస్వామి సదస్సు



**ఇల్లంతకుంట,– ఫిబ్రవరి 20 (మహాప్రభ )**
వంతడుపుల గ్రామపంచాయతీలో శుక్రవారం గ్రామీణ భాగ్యస్వామి విశ్లేషణాత్మక అంశంపై సదస్సు (పి.ఆర్.ఏ) నిర్వహించారు. జగిత్యాలకు చెందిన బీఎస్సీ అగ్రికల్చర్ ఫైనల్ ఇయర్ విద్యార్థులు ఆర్. శ్రీజ, యు. శృతి, బి. హారిత, బి. స్వాతిక, ఎన్. శ్వేత, ఎస్. భవాని శిక్షణలో భాగంగా కరీంనగర్ టీ.ఆర్.వి.కె ఆధ్వర్యంలో పలు అంశాలపై ప్రదర్శనలు చేశారు.గ్రామ సమస్యల పరిష్కారం, వ్యవసాయానికి సంబంధించిన సామాజిక మరియు వనరుల పటం, పైచార్ట్, దలిక పటం, జనాభా పైచార్ట్, కాలక్రమరేఖలను గీసి వాటి గురించి వివరించారు.ఈ కార్యక్రమంలో ఏఈవో గంగాభవాని, సర్పంచ్ లావణ్య, ఉపసర్పంచ్ గంగాచారి, గ్రామ సెక్రటరీ మహమ్మద్ అలీ, రైతులు భూపతి రెడ్డి, చిమ్మరగొట్టు శ్రీనివాస్ రాజిరెడ్డి, సత్తిరెడ్డి, లక్ష్మరెడ్డి, తిరుపతి రెడ్డి, వామన్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, రవీందర్ మరియు గ్రామస్థులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే గంగుల కమలాకర్‌పై గుగ్గిళ్ళ రమేష్ ఘాటు విమర్శలు



**కరీంనగర్, – ఫిబ్రవరి 20 (మహాప్రభ )**
బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, మాజీ డిప్యూటీ మేయర్ గుగ్గిళ్ళ రమేష్ కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్‌పై తీవ్ర విమర్శలు చేశారు. తన ప్రశ్నలకు సమాధానం చెప్పే ధైర్యం కమలాకర్‌కు లేదని, అసత్య ప్రచారాలు చేయించడం సిగ్గుమాలిన చర్య అని రమేష్ ఆరోపించారు.తాను చేసిన విమర్శలకు కట్టుబడి ఉన్నానని, ఎక్కడా అన్‌పార్లమెంటరీ పదాలు ఉపయోగించలేదని స్పష్టం చేశారు. కమలాకర్ తనపై విద్వేషంతో అనుచరులను మాట్లాడిస్తున్నారని, ఇది ఆయన బలహీనతకు నిదర్శనమని అన్నారు. ఎమ్మెల్యేగా గెలిచిన వెంటనే దాడులు చేస్తానని చెప్పి ఇప్పటివరకు చేయలేదని ఎద్దేవా చేశారు.తనపై అసత్య ప్రచారాలు ఆపకపోతే కమలాకర్ రాజకీయ జీవితంలోని మలుపులను ఆధారాలతో బయటపెడతానని హెచ్చరించారు. తాను ఐదుసార్లు ప్రజా జీవితంలో గెలిచానని, ప్రజలకు ఇబ్బంది కలిగించే పనులు ఎప్పుడూ చేయలేదని చెప్పారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో కమలాకర్‌ను రాజకీయంగా బొంద పెట్టడమే లక్ష్యమని, బిజెపి కేంద్ర మంత్రి బండి సంజయ్ నాయకత్వంలో పని చేస్తుందని రమేష్ తెలిపారు. 2028లో కమలాకర్ ఎమ్మెల్యేగా నిలబడలేదని, ప్రజాబలం కోల్పోయారని ఎద్దేవా చేశారు.

## వాట్సప్ గ్రూపులపై నిఘా – ఎస్సై వెంకటేష్



**ఆమనగల్లు, – ఫిబ్రవరి 20 (మహాప్రభ )**
సోషల్ మీడియాలో విద్వేష పూరిత, రెచ్చగొట్టే పోస్టులు పెట్టకూడదని ఆమనగల్లు ఎస్సై వెంకటేష్ హెచ్చరించారు. కుల, మత, రాజకీయ వివాదాలకు దారి తీసే పోస్టులు,వీడియోలు, షేర్ చేసినా కేసులు నమోదు చేస్తామని ఆయన తెలిపారు. గ్రూప్ అడ్మిన్ లకు బాధ్యత ఉంటుందని స్పష్టం చేశారు. సోషల్ మీడియాలో నిరంతరం నిఘా ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. సోషల్ మీడియాలో విద్వేషపూరిత పోస్టులు పెడితే కఠిన, చట్టపరమైన చర్యలు తప్పవని ఎస్సై హెచ్చరించారు.

## అందుకే కాంగ్రెస్‌తో పొత్తు -- ఆచారి

**ఆమనగల్లు, – ఫిబ్రవరి 20 (మహాప్రభ )**
మున్సిపల్ ఎన్నికల్లో బిఆర్ఎస్ నాయకుల అహంకారానికి బుద్ధి చెప్పేందుకే కాంగ్రెస్‌తో జత కట్టినట్లు జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యులు ఆచారి తెలిపారు.శుక్రవారం ఆమనగల్లు మున్సిపాలిటీ నూతన పాలకవర్గాన్ని అభినందించిన ఆయన మాట్లాడుతూ, కేంద్రం, రాష్ట్రంలో అధికారంలో లేని పార్టీతో అభివృద్ధి జరగదని, మున్సిపాలిటీ అభివృద్ధి కోసం కాంగ్రెస్‌కు అన్ని విధాలా సహకరిస్తామని అన్నారు.కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పత్య నాయక్, వైస్ చైర్‌పర్సన్ తల్లోజు గీత, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ యాట గీత, పీసీబీ సభ్యుడు బాలాజీ సింగ్, కాంగ్రెస్, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మల్లన్న సాగర్ జలాలకు ప్రత్యేక పూజలు





### కాంగ్రెస్ ప్రభుత్వంపై ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి ధ్వజం

**దుబ్బాక – ఫిబ్రవరి 20 (మహాప్రభ )**
సిద్దిపేట జిల్లా రాయపోల్ మండలం మంతూరు మల్లన్నసాగర్ ప్యాకేజ్ 13 ఐ కెనాల్ నుండి గోదావరి జలాలకు ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య రైతులు పాల్గొన్నారు. రైతుల పట్ల కపట ప్రేమ చూపుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం కాలం గడుపుతుందని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి విమర్శలు చేశారు. బి ఆర్ ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రాజెక్టులో నిర్మాణాలు చేస్తే, కనీసం కాలువలు తవ్వించే సోయి కూడా రాష్ట్ర ప్రభుత్వానికి లేకుండా పోయిందని ఆయన అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దుబ్బాక నియోజకవర్గం లోని తొగుట, మిరుదొడ్డి, దౌల్తాబాద్, రాయపోల్, చేగుంట, మండలాలు పూర్తిగా వ్యవసాయ ఆధారిత మండలాలని గుర్తు చేశారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ అధికారులు ఉన్నప్పుడు మల్లన్న సాగర్, రంగనాయక సాగర్, కొండపోచమ్మ ప్రాజెక్టులను నిర్మాణం చేయడంతో, ఇక్కడి రైతాంగం ఎంతగానో సంతోషం వ్యక్తం చేయడం జరిగిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నర సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ నేటికీ ఒక కాలువను సైతం తవ్వించలేదని విమర్శించారు. పంటలకు సాగునీరు అందించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలం కావడం జరిగిందన్నారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దుబ్బాక నియోజకవర్గం పై ప్రత్యేక దృష్టి సాధించి రైతులకు సాగునీరు ప్రాజెక్టుల ద్వారా అందే విధంగా చూడాలని డిమాండ్ చేశారు.

## శ్రీ గాయత్రీ మాత దేవాలయంలో యంత్ర హోమం

- విగ్రహ ప్రతిష్ట ఫిబ్రవరి 22 వరకు ఉత్సవాలు....!





**దుబ్బాక – ఫిబ్రవరి 20 (మహాప్రభ)**
సిద్దిపేట జిల్లా దుబ్బాక మండల పరిధిలోని రామక్కపేట, ధర్మాజీపేట, చౌదర్పల్లి, శివారులోని ఆకారం రోడ్డు పక్కన నూతనంగా ఏర్పడిన శ్రీ గాయత్రి మాత దేవాలయంలో యంత్ర హోమం, విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాలు ఘనంగా జరుగుతున్నాయి. వేద పండితులు, పూజారుల చేత పలు పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ గాయత్రి మాత విగ్రహ ప్రతిష్ట ఉత్సవాలు ఈరోజు నుంచి ఫిబ్రవరి 22, ఆదివారం వరకు కొనసాగుతాయి. చివరి రోజు యజ్ఞ హోమాలు, పూజలు, అన్న ప్రసాద వితరణ కార్యక్రమం జరుగుతాయి. చుట్టుప్రక్కల గ్రామాల వారు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆలయ కమిటీ సభ్యులు సుంకోజి మనోజ్ కుమార్ కోరారు. అనంతరం, గాయత్రి మాత ఆలయానికి లచ్చపేట గ్రామానికి చెందిన సింది రాజేశ్వర్ తన తల్లిదండ్రులు జ్ఞాపకార్థం గుడి గంటను భక్తి భావంతో బహూకరించారు. ఈ కార్యక్రమంలో శ్రీ గాయత్రీ మాత దేవాలయ సభ్యులు గురుస్వాములు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## 100 శాతం ఉత్తీర్ణత సాధించాలి.

-తల్లిదండ్రులు 10వ తరగతి విద్యార్థులను తప్పనిసరిగా పాఠశాలకు హాజరయ్యే విధంగా చూడాలి.
-విద్యార్థులు100 శాతం హాజరు ఉండాలి.
-జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్.



**మెదక్ జిల్లా–20ఫిబ్రవరి (మహాప్రభ)**
పదవ తరగతి పరీక్షల్లో శత శాతం ఉత్తీర్ణత సాధించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ విద్యార్థులకు సూచించారు. కోల్చారం మండలం పోతాంశెట్టిపల్లి గ్రామంలోని జడ్పీ హైస్కూల్లో నిర్వహిస్తున్న పదవ తరగతి ప్రత్యేక తరగతులను పరిశీలించారు. విద్యార్థుల సామర్థ్యాలను అడిగి తెలుసుకున్నారు. సబ్జెక్టులను ఏ విధంగా చదవాలి ,మంచి మార్కులు ఎలా స్కోర్ చేయాలో మెళకువలు చెప్పారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ.. పదవ తరగతి ఫలితాల్లో జిల్లాలో శత శాతం ఉత్తీర్ణత సాధించాలన్నారు. ప్రత్యేక తరగతులకు 100 శాతం హాజరు ఉండాలన్నారు. విద్యార్థులు బట్టి పద్ధతికి స్వస్తి పలికి,విషయ సామర్థ్యాన్ని పెంపొందించుకోవాలన్నారు. తూచా తప్పకుండా ప్రత్యేక తరగతులకు హాజరు కావాలన్నారు. విద్యార్థులు టీవీ, ఫోను ,సోషల్ మీడియాలకు దూరంగా ఉండాలన్నారు. ఇష్టం తో చదివి ఉన్నత స్థాయిలో ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సేవాలాల్ మహరాజ్ ఆదర్శ ప్రాయుడు.

అదనపు కలెక్టర్ నగేష్
బంజారాల ఆధ్యాత్మిక గురువు సేవాలాల్ మహరాజ్
నర్సాపూర్ ఏం ఎల్. ఏ సునీత లక్ష్మారెడ్డి.



**నర్సాపూర్ – ఫిబ్రవరి 20 (మహాప్రభ )**
శుక్రవారం నర్సాపూర్ పట్టణంలో సేవలాల్ మహారాజ్ 287 జయంతి సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ లో జిల్లా అదనపు కలెక్టర్ నగేష్, స్థానిక ఎమ్మెల్యే సున్నిత లక్ష్మారెడ్డి లు పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ మాట్లాడుతూ.. దేశ ప్రజలకు సేవాలాల్ మహారాజ్ ఆదర్శప్రాయుడన్నారు. గిరిజన సంస్కృతి సంప్రదాయాలను కాపాడి వారి ఔన్నత్యానికి పునాదులు వేశారని సేవాలాల్ మహారాజులు కొనియాడారు. శాసనసభ్యులు సునీత లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. బంజారాల ఆరాధ్య దైవం సేవాలాల్ మహారాజని, ఆయన చూపించిన ఆధ్యాత్మిక మార్గంలో నడవాలన్నారు. ఈ ర్యాలీలు అదనపు కలెక్టర్ నగేష్ నిర్వాహకులతో నుత్యం చేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు , నాయకులు పాల్గొన్నారు.

# పుట్టిన ఊరుకు ఎంతో కొంత రుణం తీర్చుకోవాలి

--అన్న ఎంపీ రఘునందన్ రావు
-స్వగ్రామంలో 82 లక్షలతో అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం...

**దుబ్బాక – ఫిబ్రవరి 20 (మహాప్రభ )**
సిద్దిపేట జిల్లా అక్బర్ పేట భూంపల్లి మండలం బొప్పాపూర్ లో పుట్టిన ఊరుకు రుణం తీర్చుకోవాలని ఆకాంక్షతో NREGS నిధులతో 82 లక్షల రూపాయలతో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. మెదక్ పార్లమెంటు సభ్యుడు రఘునందన్ రావు. ఇది తనకు అపార సంతోషాన్నిస్తోందని ఆయన ఆనందం వ్యక్తం చేశారు. గ్రామ సర్పంచ్ భాను ప్రసాద్ తో కలసి గ్రామంలో పర్యటించిన ఎంపీ, నూతన గ్రామపంచాయతీ కట్టడం తోపాటు



అభివృద్ధి పనులకు భూమి పూజ నిర్వహించారు. అంతకుముందు పక్కన ఉన్న పాఠశాలలో విద్యార్థులతో సంతమై, “ నేనెవరో తెలుసా ?” అని అడిగారు. విద్యార్థులు “ మీరు మెదక్ ఎంపీ రఘునందన్ రావు “ అంటూ గుర్తుపట్టగా, సానుకూలంగా స్పందించి స్పోర్ట్స్ దుస్తులు గిఫ్ట్ గా ఇస్తానని మాట ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఎంపీ రఘునందన్ రావు, గ్రామపంచాయతీకి ఎంత పెద్ద నిధులు ఇవ్వాలంటే ఒక ముఖ్యమంత్రి ఇలా కావాలి, కానీ మా గ్రామంలో NREGS నుంచి నిధులు తెచ్చి అభివృద్ధి చేయడం చాలా సంతోషంగా ఉంది” అన్నారు. అంతేకాకుండా, 3వ తరగతి చదువుతున్న వరుణ్ కు వినికిడి లోపం ఉండడంతో తన సొంత ఖర్చుతో ఆరు లక్షల విలువైన మిషన్ ( పేరింగ్ ఏడ్) అందించారు. పుట్టినరోజు రుణం తీర్చుకోవడం పూర్వజన్మ సుకృతమని, గ్రామస్తుల పలకరింపులు సంతోషాన్నిస్తున్నాయని ఎంపీ రఘునందన్ రావు తెలిపారు.


# రైతు బీమా పెండింగ్ క్లైములను త్వరగా పూర్తి చేయాలి

**- కలెక్టర్ పమేలా సత్పతి**



**కరీంనగర్, – ఫిబ్రవరి 20 (మహాప్రభ )**
రైతు రిజిస్ట్రేషన్‌ను నూరు శాతం పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి వ్యవసాయ విస్తరణ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ ఆడిటోరియంలో జరిగిన వ్యవసాయ శాఖ సమీక్ష సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ రైతులు మీ సేవా కేంద్రాల్లో 15 రూపాయల రుసుముతో రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని అవగాహన కల్పించాలని సూచించారు. యూరియా బుకింగ్ యాప్ వినియోగంపై రైతులకు సమాచారం ఇవ్వాలని, ఫోన్ లేని వారు రిటైలర్ వద్ద కూడా నమోదు చేసుకోవచ్చని తెలిపారు. రైతు బీమా పెండింగ్ క్లైములను త్వరగా పూర్తి చేయాలని, పీఎం శ్రీ పాఠశాలల్లో విద్యార్థుల అవగాహన కోసం మట్టి నాణ్యత పరీక్షలు నిర్వహించాలని, పీఎం కిసాన్ సమ్మాన్ నిధి కైసీని ప్రతి రైతు పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి భాగ్యలక్ష్మి, ఏడిఏ మహేష్, మండల వ్యవసాయ అధికారులు, విస్తరణ అధికారులు పాల్గొన్నారు.

# అటెండెన్స్ శాతం పేరుతో విద్యార్థులకు అన్యాయం



**కరీంనగర్, – ఫిబ్రవరి 20 (మహాప్రభ )**
శాతవాహన యూనివర్సిటీలో వికలాంగుడైన విద్యార్థి నర్సయ్యను పరీక్ష రాయడానికి అనుమతించకపోవడాన్ని నిరసిస్తూ విద్యార్థులు మూడో రోజు కూడా తరగతి గదిలో శాంతియుతంగా నిరసన కొనసాగించారు. అటెండెన్స్ శాతం పేరుతో విద్యార్థులను అన్యాయంగా వేధించడం వెంటనే ఆపాలని వారు డిమాండ్ చేశారు. విద్యార్థులు మాజీ ఎంపీ వినోద్ కుమార్‌ను కలసి విషయం వివరించారు. అదేవిధంగా బీఆర్ఎస్ నాయకులకు యూనివర్సిటీలో జరుగుతున్న అన్యాయాలను తెలియజేశారు. యూజీసీ, ఐజీఏఎస్ ఎడ్యుకేషన్ కౌన్సిల్ చైర్మన్, ఎస్సీ/ఎస్టీ సెల్ డైరెక్టర్‌కు వినతిపత్రాలు అందజేశారు. ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకొని వికలాంగ విద్యార్థికి పరీక్ష రాయడానికి అనుమతి ఇవ్వాలని, అటెండెన్స్ పేరుతో జరుగుతున్న వేధింపులను నిలిపివేయాలని విద్యార్థులు డిమాండ్ చేశారు. న్యాయం జరిగే వరకు ఉద్యమం కొనసాగుతుందని వారు స్పష్టం చేశారు.

# ఆవోపా ఆధ్వర్యంలో కార్పొరేటర్లకు ఘన సన్మానం



**కరీంనగర్, – ఫిబ్రవరి 20 (మహాప్రభ )**
కరీంనగర్ పట్టణ ఆవోపా అధ్యక్షుడు నలమాసు సుదర్శనం ఆధ్వర్యంలో 66వ డివిజన్ నుండి ఎన్నికైన వంగల పవన్, 57వ డివిజన్ నుండి ఎన్నికైన కొలిపాక రమ్య శ్రీనివాసును ఘనంగా సన్మానించారు. శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి శేష వస్త్రం, పూల మొక్కలతో సత్కరించారు. ఎన్నికైన కార్పొరేటర్లు సమాజ సేవలో ఎల్లప్పుడూ ముందుంటామని, ఆవోపా నిర్వహించే కార్యక్రమాలకు సహకారం అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు నలుమాచు చంద్రశేఖర్, గజవాడ శ్రీనివాస్, కోశాధికారి కట్కూరి చంద్రశేఖర్, ముస్త్యాల సతీష్‌కుమార్, అయిత యోగేంద్ర ప్రసాద్, పుల్లూరు రవీందర్, బీవీ ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా పరిషత్ పాఠశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు




**కరీంనగర్ – ఫిబ్రవరి 20 (మహాప్రభ )**
: ప్రపంచ సామాజిక న్యాయ దినోత్సవం సందర్భంగా ముగ్దుంపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రత్యేక న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె. రాణి ఆదేశాల మేరకు జరిగిన ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు, న్యాయవాది ఏ. కిరణ్ కుమార్ మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా నిరుద్యోగం, పేదరికం, లింగ వివక్ష, మానవ హక్కుల ఉల్లంఘనలను అరికట్టడమే ఈ దినోత్సవం ఉద్దేశమని వివరించారు. న్యాయవాదులు పెరుక రంగయ్య పటేల్, చిట్టి చంద్ర ప్రకాష్ రెడ్డి, రాచకొండ దేవేందర్ మాట్లాడుతూ కుల, మత, వర్గ విభేదాలు లేకుండా అందరికీ న్యాయం అందాలనే రాజ్యాంగ ఆశయాలను గౌరవించాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. బాల్య వివాహాల నిర్మూలన, బాల కార్మిక వ్యవస్థ రద్దు, చిన్నారులపై జరుగుతున్న అకృత్యాలను అరికట్టడంలో చట్టం రక్షణ కవచంలా పనిచేస్తుందని తెలిపారు. విద్య, వైద్యం, ఉపాధి రంగాల్లో పేదరికం అడ్డుగోడ కాకూడదని, ఆర్థిక స్తోమత లేని వారికి ఉచిత న్యాయ సహాయం అందిస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పెండోట జ్యోతి, డి. ప్రకాష్, పి. పద్మ, శ్రీనివాస్, నాగభూషణం, సిహెచ్. ప్రభాకర్ పాల్గొన్నారు. విద్యార్థులు అడిగిన సందేహాలను న్యాయ నిపుణులు నివృత్తి చేశారు.

# శుక్రవారం సభలో హెపటైటిస్ బివ్యాక్సినేషన్ ప్రారంభం

**కరీంనగర్, – ఫిబ్రవరి 20 (మహాప్రభ )**
మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కోతిరాంపూర్ సెక్టార్, శ్రీనగర్ కాలనీ అంగన్వాడీ కేంద్రంలో శుక్రవారం సభ జరిగింది. ఈ సందర్భంగా సీడీపీఓ సబిత మాట్లాడుతూ మహిళలు తమ సమస్యలను సభలో చెప్పుకోవచ్చని, గర్భిణీలు, బాలింతలు తప్పక హాజరుకావాలని సూచించారు. అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లల సృజనాత్మకత పెంపొందించే కార్యక్రమాలు జరుగుతున్నాయని, షుగర్ బోర్డుల ద్వారా ఆహారంలో చక్కెర వల్ల వచ్చే సమస్యలపై అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. మెడికల్ ఆఫీసర్ సఫిర్ హుస్సేన్ మాట్లాడుతూ ఆరోగ్య మహిళా కార్యక్రమంలో జిల్లాలో మహిళలకు 50 రకాల పరీక్షలు ఉచితంగా అందుబాటులో ఉన్నాయని, వీటిని వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమం చివరలో సీమంతాలు, అన్నప్రాసన నిర్వహించారు. ఈ సభలో ఐసీడీఎస్ అరుణ, బిసి సతీష్, అంగన్వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు, గర్భిణీలు, బాలింతలు, కిశోర బాలికలు పాల్గొన్నారు. ఈరోజు ఉదయం మోతాజుఖానా పట్టణ ఆరోగ్య కేంద్రంలో ఆరోగ్య సంరక్షకుల కోసం హెపటైటిస్ బి అడల్ట్ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి వెంకటరమణ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఆరోగ్య సంరక్షకులను హెపటైటిస్ బి వ్యాధి నుండి రక్షించడం, ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం, వారి ఆరోగ్యాన్ని మెరుగుపరచడమే ఈ కార్యక్రమం ఉద్దేశమని తెలిపారు. ఈ వ్యాక్సినేషన్ అన్ని పట్టణ ఆరోగ్య కేంద్రాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అందుబాటులో ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో అదనపు వైద్య అధికారి సుధ, ఇమ్యునైజేషన్ అధికారి సాజిద్, ఉప వైద్య అధికారి రాజగోపాల్ రావు, డిటిటి ఉమాశ్రీ, ఎంహెచ్ఎన్ సన జవేరియా, వైద్యాధికారి ఇమ్రాన్, సూపర్వైజర్ బేగ్, సిబ్బంది పాల్గొన్నారు.




# ఎస్సీడిడి కమిషనర్ సభ్యసాచి ఘోష్‌కు మినిస్టీరియల్ స్టాఫ్ అసోసియేషన్ అభినందనలు

**హైదరాబాద్, – ఫిబ్రవరి 20 (మహాప్రభ )**
షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ మరియు కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన సీనియర్ ఐఏఎస్ అధికారి సభ్యసాచి ఘోష్‌ను తెలంగాణ ఎస్సీడిడి మినిస్టీరియల్ స్టాఫ్ అసోసియేషన్ రాష్ట్ర ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. డాక్టర్ బుద్ధ జ్యోతి ప్రకాష్ సింగరేణి ఎండీగా బదిలీ కావడంతో, వారి స్థానంలో సభ్యసాచి ఘోష్‌ను రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల నియమించింది. ఈ సందర్భంగా అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పు సత్యనారాయణ, కార్యదర్శి యుఏ అరవింద్ కుమార్ శుక్రవారం కమిషనర్‌ను కలసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఇటీవల డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, ఎస్సీడిడి మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ సమక్షంలో జరిగిన సమీక్ష సమావేశంలో సభ్యసాచి ఘోష్ చొరవ తీసుకొని శాఖకు సంబంధించిన 73 పెండింగ్ బిల్లులపై దాదాపు 88 కోట్ల నిధులను మంజూరు చేయించినందుకు అసోసియేషన్ ధన్యవాదాలు తెలిపింది. అదేవిధంగా మినిస్టీరియల్ స్టాఫ్‌కు సంబంధించిన పెండింగ్ డిమాండ్లను కూడా ఆయన ముందుకు తీసుకువచ్చారు. వెంటనే స్పందించిన కమిషనర్, లిఖితపూర్వకంగా డిమాండ్లను సమర్పిస్తే తప్పకుండా పరిశీలిస్తానని హామీ ఇచ్చారు. అసోసియేషన్ వార్షిక డైరీ విడుదల కార్యక్రమానికి అతిథిగా హాజరుకావాలని ముందస్తుగా ఆహ్వానం అందించారు. ఈ సందర్భంగా సభ్యసాచి ఘోష్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తూ, ఆయన మార్గదర్శకత్వంలో శాఖ మరింత శోభను సంతరించుకుంటుందని అసోసియేషన్ ప్రతినిధులు పేర్కొన్నారు.



# భక్తి శ్రద్ధలతో శుక్రవారం ప్రార్థనలు

**కద్దాల్, – ఫిబ్రవరి 20 (మహాప్రభ )**పవిత్ర రంజాన్ మాసం మొదటి శుక్రవారంను ముస్లిం సోదరులు అత్యంత భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. కద్దాల్ మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని పలు గ్రామాల్లో ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మండల కేంద్రంలోని మస్జిద్ కుబా మస్జిద్ అర్షద్ లలో మసీదు ఇమామ్ లు జహీరుద్దీన్, తహజీబ్ ఆలం ల ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. ఈ సందర్భంగా మసీదు కమిటీ ల ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని, పాడి పంట అభివృద్ధి చెందాలని అల్లాహ్ ను ప్రార్థించారు. మసీదు కమిటీ అధ్యక్షులు అబ్దుల్ రవూఫ్, అహ్మద్ జానీ ముస్లిం సోదరులు పాల్గొన్నారు.



# బిజినెస్

## మళ్లీ బంగారానికి రెక్కలు.. భారీగా పెరిగిన ధర.. వెండి సంగతేంటి?

బంగారం ధరలకు మళ్లీ రెక్కలొచ్చాయి. భారీగా పరుగులు పెట్టిన బంగారానికి కాస్త బ్రేకులు పడి తగ్గుముఖం పడుతుండటంతో ఇప్పుడు పరుగులు పెడుతోంది. శుక్రవారం ఉదయం తగ్గిన బంగారం ధరలు.. సాయంత్రానికి భారీగా పెరిగింది. 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారంపై ఏకంగా 880 రూపాయలు పెరిగింది. అలాగే 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారంపై ఏకంగా 800 రూపాయలు ఎగబాకింది. బంగారం ధర పెరిగిన తర్వాత 24 క్యారెట్ల ధర రూ.1,57,370 ఉండగా, అదే 22 క్యారెట్ల తులం ధర రూ.1,44,250 వద్ద కొనసాగుతోంది. ఇక 18 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,18,030 వద్ద కొనసాగుతోంది.ఇక వెండి విషయానికొస్తే నిలకడగా ఉంది. ధరల్లో తేడా లేదు. కిలో వెండి ధర రూ.2,70,000 వద్ద కొనసాగుతోంది. అయితే గత మూడు రోజుల కిందట మాత్రం కిలో వెండి రూ.2.60,000 వద్ద ఉండేది. ఈ సమయంలో మళ్లీ పెరిగింది. ఇక




హైదరాబాద్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,57,370 ఉండగా, 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,44,250 వద్ద కొనసాగుతోంది.ఇరాన్ -- అమెరికా మధ్య పెరుగుతున్న ఉద్రిక్తతలు బులియన్ మార్కెట్‌పై ప్రత్యక్ష ప్రభావాన్ని చూపుతున్నాయి. సురక్షిత స్వర్గధామాలకు డిమాండ్ పెరగడంతో బంగారం, వెండి ధరలు పెరిగాయి. నిపుణుల అభిప్రాయం ప్రకారం, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు పెరిగినప్పుడల్లా, పెట్టుబడిదారులు స్టాక్ మార్కెట్ నుండి డబ్బును ఉపసంహరించుకుని బంగారం, వెండి వంటి సురక్షిత స్వర్గధామాలలో పెట్టుబడి పెడతారు. అందుకే ప్రపంచవ్యాప్తంగా, దేశీయంగా బంగారం, వెండి ధరలు పెరుగుతున్నాయి. మార్కెట్ భవిష్యత్తు దిశ ఎక్కువగా ఇరాన్-అమెరికా ఉద్రిక్తతలు, ప్రపంచ పరిణామాలపై ఆధారపడి ఉంటుంది.

## నయా పంచ్ ఈవీ




**ముంబై,**

దేశీయ ఆటోమొబైల్ దిగ్గజం టాటా మోటర్స్..ఈవీ పరిధిని మరింత విస్తరించడానికి మరో మాడల్‌ను తీసుకొచ్చింది. ఎంట్రీ లెవల్ ఈవీల మార్కెట్లోకి ప్రవేశించడానికి నయా పంచ్ మాడల్‌ను ప్రవేశపెట్టింది. ఈ కారు ప్రారంభ ధర రూ.9.69 లక్షలుగా నిర్ణయించింది. ఈ ధరలు ముంబై షోరూంనకు సంబంధించినవి. అలాగే బాష్ ఆప్షన్‌లో కూడా కొనుగోలు చేయవచ్చును.ఈ ఆప్షన్ కింద కారు ధర రూ.6.49 లక్షలు కాగా, బ్యాటరీ ఈఎంఐ ఆప్షన్ కింద కిలోమీటర్‌కు రూ.2.6గా నిర్ణయించినట్టు టాటా మోటర్స్ ప్యాసింజర్ వెహికల్ ఎండీ, సీఈవో శైలేష్ చంద్ర తెలిపారు. ఈ కారుకు ఇప్పటికే ముందస్తు బుకింగ్‌లు ప్రారంభిం చినట్టు ఆయన చెప్పారు.

## ఆర్‌బిఐ 10 బిలియన్ డాలర్ల విక్రయం

**ముంబయి**


అంతర్జాతీయ మార్కెట్‌లో ఇటీవల భారీగా పడిపోతున్న రూపాయి విలువను నిలకడగా ఉంచేందుకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) పెద్ద మొత్తంలో డాలర్లను విక్రయించింది. అమెరికాతో వాణిజ్య ప్రతిష్టంభన, విదేశీ పెట్టుబడుల తరలిపోవడంతో రూపాయి విలువ 92 చేరువలో నమోదు కావడంతో.. దీనిని కట్టడి చేయడానికి డిసెంబర్ నెలలో నికరంగా 10.02 బిలియన్ డాలర్లను విక్రయించింది. ఆర్బీఐ మంత్లీ బులెటిన్ ప్రకారం డిసెంబర్‌లో 18.33 బిలియన్ల కొనుగోళ్లు, 28.35 బిలియన్ల విక్రయాలు జరిగాయి. జనవరిలో కూడా ఒత్తిడి కొనసాగినప్పటికీ.. ఫిబ్రవరిలో భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందంతో రూపాయి తిరిగి పుంజుకుందని ఆర్‌బిఐ బులిటన్ పేర్కొంది.




# స్పోర్ట్స్

## మార్ష్, హెడ్ వీరబాదుడు.. లీగ్ దశలో ఆఖరి పంచ్ ఆస్ట్రేలియాదే..!

చివరి లీగ్ మ్యాచ్‌లో ఆస్ట్రేలియా గర్జించింది. నాకౌట్ బెర్తు చేజారిన బాధను దిగమింగుతూ ఒమన్‌పై పంజా విసిరింది. స్వల్ప ఛేదనలో మిచెల్ మార్ష్(64 నాటౌట్), ట్రావిస్ హెడ్(32)లు ప్రత్యర్థి బౌలర్లపై నిర్ధాక్షిణ్యంగా విరుచుకుపడ్డారు. వీరిద్దరూ ఎడాపెడా బౌండరీల మోత మోగించగా ఆసీస్ వడివడిగా లక్ష్యాన్ని కరిగించింది. హెడ్ ఔటయ్యాక.. ఓష్ ఇంగ్లిస్(12 నాటౌట్) రెండు ఫోర్లతో జట్టును గెలిపించాడు. పదో ఓవర్లోనే లక్ష్యాన్ని అందుకున్న కంగారూ టీమ్ రెండో విజయంతో గ్రూప్ బీలో మూడో స్థానానికి ఎగబాకింది.గ్రూప్ దశలోనే ప్రపంచకప్ నుంచి నిష్క్రమించిన ఆస్ట్రేలియా చివరి పోరులో చెలరేగిపోయింది. పసికూన ఒమన్‌ను వణికిస్తూ 9 వికెట్లతో ఘన విజయం సాధించింది. స్వల్ప ఛేదనలో ఓపెనర్ మిచెల్ మార్ష్(64 నాటౌట్) తొలి ఓవర్లోనే మూడు ఫోర్లతో తన ఉద్దేశమేంటో చాటాడు. రెండో ఓవర్లో బౌండరీతో జోరందుకున్న ట్రావిస్ హెడ్(32) మార్ష్‌తో పోటీగా చెలరేగాడు. వీరిద్దరి మెరుపులతో 4.1 ఓవర్‌కే స్కోర్ యాభై




దాటింది.

మార్ష్, హెడ్ విధ్వంసంతో పవర్ ప్లేను 73 రన్స్ చేసింది. అలీకి చుక్కలు చూపిస్తూ.. మూడు ఫోర్లు, సిక్సర్ బాదాడు మార్ష్. వీరిద్దరి జోరు చూశాక అజేయంగా మ్యాచ్‌ను ముగిస్తారనిపించింది. కానీ, 9వ ఓవర్లో హెడ్ గాల్లోకి లేపిన బంతిని వికెట్ కీపర్‌తో పోటీపడిన షకీల్ ఒడుపుగా అందుకున్నాడు. తొలి వికెట్ తీసిన సంతోషంలో ఒమన్ ఆటగాళ్లకు దక్కినా.. అప్పటికే ఆసీస్ విజయం ఖాయమైంది. 17 పరుగులే అవసరమవ్వగా.. జోష్ ఇంగ్లిస్(12 నాటౌట్)తో కలిసి మార్ష్ లాంఛనం పూర్తి చేశాడు.

**జంపా మ్యాజిక్**

వరల్డ్‌కప్‌లో బోణీ కొట్టని ఒమన్‌కు చివరి మ్యాచ్‌లోనూ బ్యాటర్లు పెద్ద స్కోర్ అందించలేదు. ఇన్నింగ్స్ తొలి బంతికే ఓపెనర్ అమిర్ కలీం(0)ను బౌల్డ్ చేసి గ్జావియర్ బార్ట్‌లెట్(2-27) వికెట్ల వేటకు తెరతీశాడు. బార్ట్‌లెట్, ఎల్లిస్ విజృంభణతో పవర్ ప్లేలో కీలక వికెట్లు పడగా.. ఒమన్ కష్టాల్లో కూరుకుపోయింది. అసలే తడబడుతున్న ప్రత్యర్థి బ్యాటర్లను ఆడం జంపా(4-21) మరింత దెబ్బకొట్టాడు. హమ్మద్ మిర్జా(16) వికెట్‌తో ఖాతా తెరిచిన లెగ్ స్పిన్నర్ కోలుకోలేకపోయింది.వసీం అలీ(32) పోరాడినా.. సహచరులు డగౌట్‌కు క్యూ కట్టారు. చివరి బ్యాటర్ షఫీక్ జైన్(0)ను బౌల్డ్ చేసిన జంపా 104 వద్ద ఒమన్ ఇన్నింగ్స్‌కు తెరదించాడు. నాలుగు వికెట్ల పడగొట్టిన జంపా.. పొట్టి వరల్డ్‌కప్ చరిత్రలో రెండో అత్యధిక వికెట్ల వీరుడిగా అవతరించాడు. బంగ్లాదేశ్ వెటరన్ షకీబుల్ హసన్50 వికెట్లతో అగ్రస్థానంలో ఉండగా.. రషీద్ ఖాన్ (43 వికెట్లు) మూడో స్థానానికి పడిపోయాడు.

## వైభవ్ సూర్యవంశీ భారీ షాట్.. పగిలిన వాటర్ పైప్..



**నాగపూర్**

వైభవ్ సూర్యవంశీ తన పవర్ స్ట్రోక్స్‌తో ఆకట్టుకుంటున్న విషయం తెలిసిందే. ఆ కుర్రాడు ఇంకా సీనియర్ మెన్స్ క్రికెట్‌లోకి అడుగుపెట్టలేదు. కానీ అతను కొడుతున్న షాట్స్ మాత్రం దుమ్మురేపుతున్నాయి. చాలా పవర్‌తో అతను స్ట్రోక్స్ రిలీజ్ చేస్తున్నాడు. తాజాగా ముగిసిన అండర్19 వరల్డ్‌కప్‌లో తన గేమ్‌తో బెంబేలెత్తించాడు. ఫైనల్లో ఏకంగా ఇంగ్లండ్‌పై 175 రన్స్ చేసి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. ప్రస్తుతం ఆ యువ సెన్సేషన్ రాబోయే ఐపీఎల్ కోసం ప్రిపేరవుతున్నాడు. నాగపూర్‌లోని రాజస్థాన్ రాయల్స్ జట్టుతో ప్రాక్టీస్ చేస్తున్నాడు.గురువారం ప్రాక్టీస్ సెషన్‌లో ఓ ఘటన చోటుచేసుకున్నది. బ్యాటింగ్ చేస్తున్న వైభవ్.. ఎప్పటి తరహాలోనే భారీ షాట్ ఆడాడు. స్క్వేర్ లెగ్ దిశగా పవర్‌ఫుల్ పుల్ షాట్ బాదాడు. వైభవ కండ బలానికి ఆ బంతి చాలా దూరం ప్రయాణించింది. ఓ బిల్డింగ్ మీదున్న నీళ్ల పైప్‌ను ఆ బంతి తాకడంతో ఆ పైప్ పగిలిపోయింది. ఆ పైప్ నుంచి నీరు కారుతున్న దృశ్యానికి చెందిన వీడియోను రాజస్థాన్ రాయల్స్ రిలీజ్ చేసింది. తమ ఎక్స్ అకౌంట్‌లో ఆ టీమ్ పోస్టు చేసింది. సూర్యవంశీ చేష్టలివన్నీ అంటూ ఓ కామెంట్ ట్యాగ్ చేసింది.

## శ్రీలంకను పడగొట్టిన రాధ యాదవ్..

### ఆసియా కప్ ఫైనల్లో భారత్..!

మహిళల ఆసియా కప్ రైజింగ్స్ స్టార్స్‌లో భారత ఏ జట్టు ఫైనల్‌కు దూసుకెళ్లింది. సెమీఫైనల్లో భారీ విజయంతో శ్రీలంకను ఇంటికి పంపి టైటిల్‌కు అడుగు దూరంలో నిలిచింది. స్వల్ప ఛేదనలో ఓపెనర్ విందా దినేశ్(42), రాధా యాదవ్(32 నాటౌట్, 4-19) కెప్టెన్ ఇన్నింగ్స్ ఆడడంతో 5 వికెట్ల తేడాతో లంకను చిత్తు చేసింది. ఫైనల్లో బంగ్లాదేశ్‌తో తలపడనుంది.బ్యాంకాక్ వేదికగా జరుగుతున్న మహిళల ఆసియా కప్ రైజింగ్ స్టార్స్‌లో భారత ఏ జట్టు పంజా విసిరింది. లీగ్ దశలో అదరగొట్టిన టీమిండియా సెమీఫైనల్లోనూ చెలరేగిపోయింది. భారీ స్కోర్‌తో భారత్‌కు చెక్ పెట్టాలనుకున్న లంక ఆశలకు కెప్టెన్ రాధా




యాదవ్ (4-19) అడ్డుకట్ట వేసింది. వికెట్ల వేటతో రెచ్చిపోగా.. ప్రత్యర్థి 118 పరుగులకే కుప్పకూలింది. లంక జట్టులో ఓపెనర్లు సంజనా కవింది(31), హన్సిమ కరుణరత్నే(14)లను విడదీసి తనూజ కన్వర్ బ్రేకివ్వగా.. అక్కడి నంచి రాధా యాదవ్ తిప్పేసింది. మిడిలార్డర్‌ను పడగొట్టిన తను.. లోయర్ ఆర్డర్‌ను డగౌట్ చేర్చింది. ఆఖర్లో శశిని గుహ్మని(22) మాత్రమే రాణించగా లంక 118కి ఆలౌటయ్యింది.


**విందా, రాధ దూకుడు**

ప్రత్యర్థిని తక్కువకే కట్టడి చేసి సగం విజయం సాధించిన భారత్‌కు ఓపెనర్లు నందినీ కశ్యప(14), విందా దినేశ్‌లో (42) అదిరే ఆరంభమిచ్చారు. వీరిద్దరూ ఔటయ్యాక క్రీజునంటుకుపోయిన రాధా యాదవ్(31 నాటౌట్) లంక బౌలర్లను ధీటుగా ఎదుర్కొంది. అజేయంగా నిలిచి జట్టును ఫైనల్‌కు తీసుకెళ్లింది. 5 వికెట్ల తేడాతో టీమిండియా జయకేతనం ఎగురవేసిన భారత్ ఆదివారం జరుగబోయే టైటిల్ పోరులో బంగ్లాదేశ్‌ను ఢీకొట్టనుంది.





# ఉస్తాద్ నుంచి 22న మరో సాంగ్ విడుదల

గబ్బర్‌సింగ్' తర్వాత పవన్ కల్యాణ్ - డైరెక్టర్ హరీశ్ శంకర్ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న సినిమా 'ఉస్తాద్ భగత్‌సింగ్'. మార్చి 26న ఈ చిత్రం విడుదల కానున్న సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా చిత్ర బృందం ప్రమోషన్స్‌లో జోష్ పెంచింది. ఇప్పటికే ఓ పాటను రిలీజ్ చేయగా.. తాజాగా 'ఆరా ఆఫ్ ఉస్తాద్' సాంగ్ ప్రోమోను పంచుకుంది. పూర్తిపాటను ఈ నెల 22న విడుదల చేయనుంది. విజువల్స్, మ్యూజిక్‌ని బట్టి ఈ సాంగ్ పవర్‌ఫుల్‌గా ఉండనున్నట్లు తెలుస్తోంది.




# యశ్ టాక్సిక్ టీజర్ విడుదల

యశ్ హీరోగా గీతూ మోహన్‌దాస్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'టాక్సిక్'. 'ఫెయిరీటేల్ ఫర్ గ్రోన్‌అప్స్' అనేది ఉప శీర్షిక. ఇందులో యశ్‌తో పాటు అయిదుగురు హీరోయిన్లు కీలక పాత్రలు పోషిస్తున్నారు. నదియా పాత్రలో కియారా కనిపించనుండగా హ్యుమా ఖురేషీ ఎలిజెబెత్‌గా, నయనతార గంగ పాత్రలో, రెబెకాగా తారా సుతారియా, మెలిసా అనే పాత్రలో రుక్మిణి వసంత్ ఆకట్టుకోనున్నారు. మార్చి 19న ఈ సినిమా విడుదల కానుంది. ఈ నేపథ్యంలో తాజాగా దీని టీజర్‌ను విడుదల చేశారు. విరోధం పెట్టుకొని బతకలేవు.. పట్టుదల వదిలేయ్ అనే డైలాగులతో మోస్ట్ వైలెంట్‌గా రాయాపాత్రలో యశ్ కనిపించారు.



# గ్యాప్ ఇవ్వలేదు.. తీసుకున్నా అంటున్న

గ్యాప్ రాలేదు.. నేను ఇచ్చానంటున్నారు కీర్తి సురేష్. పెళ్లి తర్వాత ఈమెకు అవకాశాలు రావట్లేదని అనుకున్నారంతా. కానీ సీన్ చూస్తుంటే అలా లేదు.. ఆఫర్స్ వచ్చినా కూడా తానే గ్యాప్ తీసుకున్నట్లు తెలుస్తుంది. పెళ్లైన రెండేళ్లకు జోరు పెంచేసారు ఈ బ్యూటీ. ఇప్పటికే తెలుగులో 2.. తమిళంలో 2.. హిందీలో ఓ సినిమాతో రప్ఫాడిస్తున్నారు. ఇంతకీ కీర్తి ఇప్పుడెన్ని సినిమాలు చేస్తున్నారు..? బేబీ జాన్ తర్వాత తెలియకుండానే కీర్తి సురేష్ కెరీర్‌లో చిన్న బ్రేక్ అయితే వచ్చింది.. పెళ్లైంది కదా ఆ మాత్రం గ్యాప్ రావడం సహజమే అంటున్నారు ఫ్యాన్స్. సెకండ్ ఇన్నింగ్స్ కోసం కాస్త టైమ్ అయినా ఇవ్వాలిగా అంటూ కీర్తికే సపోర్ట్ చేస్తున్నారు ఫ్యాన్స్. ఈ క్రమంలోనే అభిమానుల అంచనాలు నిలబెడుతూ.. వరస ప్రాజెక్ట్స్‌కే ఓకే చెప్తున్నారు ఈ కేరళ కుట్టి. ఆంటోనీ తట్టిల్‌ను పెళ్లి చేసుకున్నాక కాస్త గ్యాప్ తీసుకున్నారు ఈ బ్యూటీ. తెలుగులో ఈ మధ్యే విజయ్ దేవరకొండతో రౌడీ జనార్ధన సినిమాకు ఓకే చెప్పారు కీర్తి. దాంతో పాటు అనిల్ రావిపూడి, వెంకీ సినిమాలో కీర్తి సురేష్ ఫస్ట్ ఛాయిస్ అని తెలుస్తుంది.. అలాగే సుమంత్ నటిస్తున్న మహేంద్రగిరి వారాహి సినిమాలో అతిథి పాత్ర చేస్తున్నారు ఈ బ్యూటీ. తెలుగులో మాత్రమే కాదు.. తమిళంలోనూ కీర్తికి అవకాశాలు బాగానే వస్తున్నాయి. అక్కడ కన్నివేడి అనే సినిమాతో పాటు మరో రెండు కథలు ఫైనల్ చేసారు. ఇక మలయాళంలో తొట్టం సినిమా చేస్తున్నారు. ఇక హిందీలోనూ ఓ సినిమాలో గెస్ట్ రోల్ చేయబోతున్నారు కీర్తి. మొత్తానికి పెళ్లి తర్వాత చిన్న గ్యాప్ ఇచ్చి.. అన్ని ఇండస్ట్రీల్లోనూ మళ్లీ రచ్చ చేస్తున్నారు కీర్తి.

# బాలీవుడ్‌లో తనపై తీవ్ర వివక్ష !!

## కుండబద్దలుకొట్టిన రెజీనా

ఒకప్పుడు టాలీవుడ్, కోలీవుడ్ అనే తేడా లేకుండా వరుస ప్రాజెక్టులతో రెజీనా కసాండ్రా ఓ వెలుగు వెలిగింది. అగ్ర హీరోల సరసన నటించే అవకాశం రాకపోయినా.. టైర్-2 హీరోలైన రవితేజ, సాయి ధరమ్ తేజ్, గోపీచంద్, సందీప్ కిషన్ వంటి వారితో జతకట్టి తనకంటూ ప్రత్యేకమైన ఇమేజ్‌ను క్రియేట్ చేసుకుంది. గ్లామర్ పాత్రలతో పాటు నటనకు ఆస్కారం ఉన్న రోల్స్ చేస్తూ దక్షిణాదిలో తనకంటూ ఒక బలమైన పునాది వేసుకుంది. ఈ క్రమంలోనే బాలీవుడ్‌లో తన అదృష్టాన్ని పరీక్షించుకునే ప్రయత్నం చేసింది. అనిల్ కపూర్, సోనమ్ కపూర్ వంటి బడా స్టార్స్ ఉన్న 'ఏక్ లడ్కీ కో దేఖా తో ఐసా లగా' సినిమాతో హిందీలో ఎంట్రీ ఇచ్చింది. కానీ ఆ సినిమా బాక్సాఫీస్ వద్ద బోల్తా కొట్టడంతో ఆమె ఆశలు అడియాశలయ్యాయి. ఆ తర్వాత కొన్ని వెబ్ సిరీస్‌లు, చిన్న సినిమాల్లో మెరిసినా, దక్షిణాదిలో ఆమెకు దక్కినంత గుర్తింపు కానీ, స్టార్ డమ్ కానీ అక్కడ దక్కలేదు. కనీసం పట్టించుకున్న పాపాన కూడా పోలేదు బాలీవుడ్ మేకర్స్. అయితే సినిమాల జయాపజయాలు పక్కన పెడితే, ముంబైలో తనకు ఎదురైన అనుభవాలు చాలా చేదుగా ఉన్నాయని రెజీనా ఇటీవల ఓ సందర్భంలో గుర్తు చేసుకుంది. ముఖ్యంగా దక్షిణాది నుంచి వచ్చిన నటీమణుల పట్ల అక్కడి వారి దృక్పథం భిన్నంగా ఉంటుందని ఆమె అభిప్రాయపడింది. అక్కడి వాళ్ల మాటల్లో, ప్రవర్తనలో ఒక రకమైన వివక్ష స్పష్టంగా కనిపించేదని.. దక్షిణాది నటులు అంటే ఒక రకమైన చిన్నచూపు ఉండేదని ఆమె మాటల ద్వారా అర్థమవుతోంది. బాలీవుడ్ వాతావరణం తనకు ఏమాత్రం సౌకర్యవంతంగా అనిపించలేదని.. అక్కడ పని చేయడం ఒక ఇబ్బందికరమైన అంశంగా మారిపోయిందని రెజీనా ఆవేదన వ్యక్తం చేసింది. ఆ సంకుచిత వాతావరణం కారణంగా అక్కడ సినిమాలు చేయాలంటేనే భయం వేసే పరిస్థితి వచ్చిందని పేర్కొంది. అంతేకాదు.. మన సౌత్‌లో హీరోయిన్లకు ఉండే ఫ్రీడమ్ అక్కడ ఉండదని ఓపెన్‌గానే చెప్పుకొచ్చింది రెజీనా. అందరికీ ఇలాంటి అనుభవాలే ఎదురవుతాయని చెప్పలేం కానీ, తన విషయంలో మాత్రం బాలీవుడ్ జర్నీ అంత సాఫీగా సాగలేదని ఆమె కుండబద్దలు కొట్టింది.బాలీవుడ్ కల్చర్ మీద ఇంతలా అసంతృప్తి వ్యక్తం చేస్తున్నప్పటికీ.. రెజీనా అక్కడి ప్రయత్నాలను మాత్రం ఆపలేదు. తమ్ముడు తమ్ముడే పేకాట పేకాటే అన్నట్లు బాలీవుడ్ ఆఫర్స్ కోసం ఇప్పటికీ వేచి చూస్తూనే ఉంది ఈ బ్యూటీ. ప్రస్తుతం 'ది వైవ్స్', 'సెక్షన్ 108' వంటి హిందీ ప్రాజెక్టులతో ఆమె బిజీగానే ఉంది.



# సొంత రికార్డును అనుపమ బ్రేక్ చేస్తారా



అనుపమ పరమేశ్వరన్ తన చిత్రాల ఎంపికలో ప్రాధాన్యతలను మార్చుకున్నట్టు స్పష్టంగా కనిపిస్తోంది. ఆమె ఎంచుకునే ప్రతి సినిమాలో ఏదో ఒక ప్రత్యేకత ఉంటుందని ప్రేక్షకులు నమ్ముతున్నారు. నేపథ్యం కంటే కథ, కథనంలోని కొత్తదనం ఉంటేనే ఆమె సినిమాకు గ్రీన్ సిగ్నల్ ఇస్తున్నారు. గత ఏడాది ఏకంగా అరడజన్ సినిమాలతో అనుపమ మెప్పించారు. వాటిలో కొన్ని ఆశించిన విజయం సాధించకపోయినా, మరికొన్ని ఆమెకు మరిన్ని అవకాశాలను తెచ్చిపెట్టాయి.

Edited,Printed,Published & Owned by Mr.Nakka Raju, RNI No : TGTEL/26/A0738, Printed at NEWS 24HRS MEDIA SERVICES,Suryapet,- 508213 Telangana.
Published at 1-113 Prabhat Nagar,Chaitanyapuri,Rangareddy,Telangana - 500060.Telangana State. EDITOR : Mr.NAKKA RAJU, Cell 9160600610 | netibharath.daily@gmail.com